J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 20

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

లాయర్

సంపుటి : 43 సంచిక : 43 29.03.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




## ఈ ఐదేళ్ళలో 130 సార్లు బటన్ నొక్కి 2,70,000 కోట్లు

# డబ్బులిచ్చాం.. ఓట్లేయండి!

## ▶ పంపకాన్నే ప్రచారాస్త్రంగా వాడుకుంటున్న వైసీపీ



***ఈ*** *అయిదేళ్ల కాలంలో 100 పరిశ్రమలు తెచ్చాం, లక్ష మందికి ఉపాధి కల్పించాం. అధిక సంఖ్యలో నీటిపారుదల ప్రాజెక్టులు కట్టాం, లక్షలాది ఎకరాలకు నీరు అందించి, కొన్ని వేల రైతు కుటుంబాల జీవితాలు కాంతిమయం చేశాం. విస్తృత స్థాయిలో రోడ్లు, భవనాలు, కాల్వలు వంటి అనేక మౌలిక వసతులు కల్పించి రాష్ట్రాన్ని సుందర నందనవనంగా తీర్చిదిద్దాం. కరెంటు బిల్లులు తగ్గించాం. ఇంటి పన్నులు పెరగకుండా చూశాం. నిత్యావసర వస్తువుల ధరలని అదుపులో ఉంచాం. డీజిల్, పెట్రోలు రేట్లని ఆకాశాన్ని తాకకుండా చేశాం. క్రైమ్ రేటు పెరగలేదు, దొంగతనాలు జరగలేదు. అవినీతి అడ్రస్సే తెలియలేదు. మద్యం మాటే లేదు. ఇలాంటివి ఇంకా అనేక కార్యక్రమాల ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశాం...*

సహజంగా ఏ ప్రభుత్వమైనా ఐదేళ్ళు పరిపాలించిన తరువాత పైన పేర్కొన్న అన్ని విభాగాల లెక్కలు ప్రజల ముందు పెట్టి మళ్ళీ ఓట్లడుగుతారు. తమ పాలనలో రాష్ట్రం లేదా దేశం అభివృద్ధి సంక్షేమం దిశగా పరుగులు తీయాలంటే మళ్ళీ తమకే ఓటేయాలని అభ్యర్థిస్తారు.

కానీ, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో సహా గడచిన ఐదేళ్లలో ప్రజల ఖాతాలలో తాము జమ చేసిన డబ్బుల లెక్కలు చెప్తున్నారు తప్ప, వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రస్తావనే తేవడంలేదన్నది విశ్లేషకుల అభిప్రాయం.

18లో






## 'సత్య'కి.. ధర్మవరం సీటు

3లో...



# వైకాపా అభ్యర్థులను గెలిపించండి

• పర్వతరెడ్డి సన్మాన సభలో విజయసాయిరెడ్డి



రానున్న ఎన్నికల్లో వైకాపా అభ్యర్థులకు ఘనవిజయం చేకూర్చాలని నెల్లూరు పార్లమెంట్ వైకాపా అభ్యర్థి విజయసాయిరెడ్డి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నెల్లూరు 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల పర్వతరెడ్డికి భారీ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విజయసాయిరెడ్డి, నెల్లూరు నగర వైకాపా అభ్యర్థి ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక బాలాజీనగర్ నుంచి విక్రమ్ హైస్కూల్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైస్కూల్ మైదానంలో జిల్లా అధ్యక్షులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని, విజయసాయిరెడ్డిని, ఖలీల్ అహ్మద్‌ను కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ, చంద్రశేఖర్ రెడ్డి ఎమ్మెల్సీగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ఎంతో చొరవ చూపారని, అతి తక్కువ సమయంలోనే వైయస్ జగన్మోహన్‌రెడ్డితో మంచి సాన్నిహిత్యం సంపాదించారని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# కందుకూరులో..వేమిరెడ్డికి అపూర్వ స్వాగతం



నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం-బిజెపి-జనసేన ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కందుకూరు నియోజకవర్గం ప్రజలు ఇటీవల అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. వేలాదిగా తరలివచ్చిన మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు అడుగడుగునా నీరాజనాలు పలుకుతూ స్వాగతించారు. మొదట సింగరాయకొండ బైపాస్ రోడ్డు వద్ద, నియోజకవర్గ తెలుగుదేశం కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి భారీ స్వాగతం పలికారు. అనంతరం నాయకులు కందుకూరుకి చేరుకోగానే భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పెద్ద బజారులో గల పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్యులంతా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులకు మద్దతు తెలియజేస్తూ గజమాలతో సత్కరించారు. అక్కడ నుంచి ర్యాలీగా పామూరు రోడ్డులో ఎస్వీఎస్ కళ్యాణమండపం చేరుకొని పార్టీ శ్రేణులతో వారు ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం బిజెపి జనసేన ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటు ఖాయమని స్పష్టం చేశారు. ప్రజలందరి ఆశీస్సులతో నెల్లూరు పార్లమెంటు పరిధిలో అన్ని స్థానాల్లోనూ పసుపు జెండా ఎగరవేయబోతున్నామని ఆకాంక్షించారు. కందుకూరులో అభ్యర్థిగా పోటీచేయబోతున్న ఇంటూరి నాగేశ్వరరావు ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నారని గుర్తుచేస్తూ, రాబోయే ఎన్నికల్లో ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈసారి ఎన్నికల్లో కందుకూరులో చరిత్ర సృష్టించబోతున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆదరాభిమానాలతో తాము గెలిచాక, కందుకూరును అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి భారీ చేరికలు జరిగాయి. పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాంతో పాటు పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీడీపీ వస్తేనే..రాష్ట్రానికి సంక్షేమం

- నారా భువనేశ్వరి



తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి-సంక్షేమంతో ముందుకు సాగుతుందని టీడీపీ అధినేత-మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. వెంకటాచలం మండలంలోని కురిచెర్లపాడు, పుంజులూరుపాడు గ్రామాల్లో ఆమె ఈనెల 23న పర్యటించి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రం డ్రగ్ మాఫియాలకు నిలయంగా మారిందని, ప్రజల ఆస్తులకు, ప్రాణాలకు భద్రత లేకుండాపోయిందని విమర్శించారు. వైకాపా అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి రాజధాని కూడా లేకుండా చేశారని, అభివృద్ధి కుంటుపడి రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కిపోయిందని విమర్శించారు. జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేదన్నారు. పార్టీకోసం ప్రాణాలొదిలిన కార్యకర్తల త్యాగాలను తాము విస్మరించేది లేదన్నారు. వైకాపాను గద్దె దించేందుకు, తెలుగు దేశం పార్టీని గెలిపించుకునేందుకు ప్రతిఒక్కరూ కష్టించి పని చేయాలని కార్యకర్తలకు, నాయకులకు ఆమె సూచించారు. టీడీపీని గెలిపించుకుని రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చుకుందామని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు ఆమె వెంట కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి, టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దోపిడి రాజ్యం నుంచి..

# ప్రజలకు విముక్తి కలగాలి

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి సన్నిధిలో సోమిరెడ్డి పూజలు



వైకాపా దోపిడి రాజ్యం నుంచి ప్రజలకు విముక్తి కలగాలంటూ జిల్లాలోని ప్రసిద్ధ అవధూత క్షేత్రమైన గొలగమూడిలో ఉన్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మందిరంలో టీడీపీ నేత, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దంపతులు ఇటీవల పూజలు చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి దుశ్చర్యలకు ప్రజలు ఫుల్‌స్టాప్ పెట్టాలని, రానున్న ఎన్నికల్లో సర్వేపల్లి నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను ఆదరించి గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైకాపా పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. కాకాణి అక్రమాలకు అడ్డుకట్టవేసి, ప్రజల ఆస్తుల పరిరక్షణకు, వైకాపా అరాచకాల నుంచి ప్రజలను కాపాడేందుకు తనకు అవకాశం కల్పించాలని భగవాన్ శ్రీ వెంకయ్య స్వామిని ప్రార్థించినట్లు ఆయన చెప్పారు. ప్రజలంతా బాగా ఆలోచించి సర్వేపల్లి నియోజకవర్గంలో బిడ్డల భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# కావలిలో అరాచకాలు తప్ప..అభివృద్ధి శూన్యం

**కావ్య కృష్ణారెడ్డి ధ్వజం**

కావలి నియోజకవర్గంలో అరాచకాలు తప్ప, అభివృద్ధి శూన్యమని, వైకాపా పాలనలో అన్నీ అక్రమాలేనని కావలి నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 24న ఆయన కావలి 34వ వార్డులో టీడీపీ పట్టణాధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ అధ్యక్షత్వంలో, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో కొందరు నాయకులు వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గత అయిదేళ్ళుగా కావలి అభివృద్ధికి దూరంగానే ఉందని, ప్రశ్నించినవారిపై కేసులు పెట్టడమే తప్ప ఇక్కడి నాయకులు కావలి ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, ప్రజల కోసం పనిచేసే వేమిరెడ్డిని ఎంపీగా గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# వైకాపా గెలిచేది..కల్ల!

• జనసేన నాయకుడు గునుకుల కిషోర్

జిల్లాలో వైకాపా గెలిచేది కల్ల అని, గతంలో పదికి పది స్థానాలు వచ్చిన వైకాపాకి ఈసారి ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా గెలిచే పరిస్థితి లేదని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గునుకుల కిషోర్ అన్నారు.

వైకాపా నాయకుల తీరుకు నిరసనగా ఈనెల 25న నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో ప్లకార్డులు చేతపట్టి నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ, విశాఖ నుంచి వచ్చిన విజయసాయి గత 40 ఏళ్లుగా ఎప్పుడూ జిల్లాకు ఏ మంచీ చేయలేదని, ఎన్నికలు వచ్చాయి కనుక తాను ఈ జిల్లా వాసినని చెప్పుకోవడం తప్ప ఆయన జిల్లా ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. రాష్ట్రంలో అరాచకాలకు, అవినీతి అక్రమాలకు తెగబడుతున్న వైకాపాను ప్రజలు తిరస్కరించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అలాంటి అవినీతిపరులకు తమ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. వైకాపా నేతలు సభ్యత సంస్కారం కూడా లేకుండా ఎన్నికల్లో గెలవాలని టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలకు, లేనిపోని నిందారోపణలకు దిగుతున్నారని, ప్రజలు అలాంటివారికి గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు.

## అన్నపూర్ణ ఆంధ్రను..

# అప్పులపాలు చేశారు

- పోలంరెడ్డి దినేష్‌రెడ్డి విమర్శ -



ఆంధ్రుల అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్ వైకాపా పాలనతో నేడు అంధకార ఆంధ్రప్రదేశ్‌గా మారిపోయిందని, దేశానికే తలమానికంగా నిలిచిన రాష్ట్రం నేడు అప్పులపాలై, మాఫియాలకు అడ్డాగా మారుతోందని తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, కోవూరు నియోజకవర్గ టీడీపీ నాయకుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వైకాపా అధికారంలోకి వచ్చాక రాష్ట్రం సర్వనాశనమైందని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీల కలయికతో రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైతే, చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం మళ్ళీ ఈ కష్టాల నుంచి కోలుకుంటుందన్నారు. అందుకోసం ప్రజలు ఈ ఎన్నికల్లో ఆ మూడుపార్టీలకు చెందిన ఉమ్మడి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత, తనను టీడీపీ నేత చంద్రబాబునాయుడు టీడీపీ జాతీయ అధికార ప్రతినిధిగా నియమించినందుకు ఆయన పార్టీ అధిష్టానవర్గానికి కృతజ్ఞతలు చెప్పారు. కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియోజకవర్గం సమస్యల మీద గళమెత్తిన నన్ను ఈ ఎన్నికల సమయంలో పార్టీ వాణిగా జనంలో ఉండమని, పార్టీ గెలుపులో భాగస్వామ్యం కావాలని చంద్రబాబునాయుడు తనకు బాధ్యత అప్పగించారని, ఆ బాధ్యత నిర్వర్తించడం కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన చెప్పారు.

# ధర్మవరం బీజేపీ అభ్యర్థిగా సత్యకుమార్

## • క్యాండిడేట్‌గా మారిన వ్యూహకర్త!



**మొన్నటి వరకు ఆయన బీజేపీ సమన్వయకర్త. ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ జాతీయ కార్యదర్శి హోదాలో ఆ ఎన్నికల వ్యూహకర్తగా, సమన్వయకర్తగా వ్యవహరించేవారు. ఇప్పుడు ఆయనే అభ్యర్థి అయ్యారు. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడి ప్రియశిష్యుడిగా రెండు దశాబ్దాలకిపైగా సేవలందించి, నెల్లూరీయులందరికీ ఆప్తుడిగా, ఆత్మీయుడిగా మారిన వై.సత్యకుమార్‌ని భాజపా ధర్మవరం అసెంబ్లీ అభ్యర్థిగా ఆ పార్టీ ఎన్నికల బరిలో దించింది. తొలిసారిగా సత్యకుమార్ ప్రత్యక్ష రాజకీయాలలలోకి వచ్చి ప్రజాక్షేత్రంలో పోరాడబోతున్నారు.**


సత్య పుట్టింది అనంతపురం జిల్లా గాడేకల్లు అనే గ్రామం. నిరాడంబరమైన మధ్య తరగతి కుటుంబం ఆయన నేపథ్యం. ప్రొద్దుటూరు, నాగర్‌కర్నూలులో బాల్య విద్యాభ్యాసం పూర్తిచేసి, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారిలో పీయుసి చదివారు. మదనపల్లిలో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిప్లొమా, ఆ తరువాత బెంగళూరులో ఏఎంఐఈ కోర్సు ద్వారా ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకున్నారు. ఇక్కడే ఆయన రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. విద్యార్థుల సమస్యలపైన పోరాటం సాగిస్తూ అదే తరుణంలో మధురై కామరాజ్ యూనివర్సిటీ నుండి పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీ అందుకున్నారు. అనంతరం మద్రాసు ఇన్‌స్టిట్యూట్ ఫర్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు పూర్తిచేశారు. ప్రస్తుతం ఓ వైపు రాజకీయాలలో క్షణం తీరిక లేకుండా తన గురువు తరహాలో దేశమంతా పర్యటిస్తూనే, మరో వైపు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసిస్తున్నారు.

1990-93 మధ్యకాలంలో భారతీయ జనతా పార్టీతో సత్యకుమార్ బంధం బలపడుతూ వచ్చింది. అదే సమయంలో వెంకయ్యానాయుడి దృష్టి సత్యపై పడింది. ఆ తరువాత సుమారు పాతికేళ్ల పాటు సత్య ప్రస్థానం, ప్రయాణం వెంకయ్యతో కొనసాగింది. వెంకయ్య వద్ద వివిధ హోదాల్లో పనిచేసి, వెంకయ్యానాయుడు ఉపరాష్ట్రపతి పీఠం అధిరోహించాక సత్యకుమార్ భారతీయ జనతా పార్టీ సభ్యత్వం తీసుకుని పార్టీ సేవకోసం అంకితమై పనిచేస్తున్నారు. సత్యలోని చురుకుదనాన్ని, కార్యదక్షతని గమనించిన పార్టీ ఆయనకి 2018లో జాతీయ కార్యదర్శి పదవిని కట్టబెట్టింది. పలు సందర్భాలలో కొన్ని కీలక బాధ్యతలు అప్పజెప్పింది. వరుసగా మూడు పర్యాయాలు ఆయనని కార్యదర్శి పదవిలో కొనసాగిస్తూనే వచ్చింది. దేశంలోని అనేక ప్రాంతాలలో సత్య సేవలని పార్టీ ఉపయోగించుకుంది.

ఇప్పుడు తొలిసారిగా శాసనసభ అభ్యర్థిగా టిక్కెట్టు ఇచ్చి కదన రంగంలోకి పంపుతోంది. తాను జన్మించిన గడ్డపై నుండే సత్యకుమార్‌యాదవ్ పోటీ చేయబోతున్నారు. అయిదు పదుల వయసులో వున్న సత్య జీవితం పాతికేళ్ళకిపైగా అంటే తన జీవితంలో సగభాగాని కంటే ఎక్కువగా నెల్లూరీయులతో ముడిపడి వుంది. మొదటిసారిగా సత్యకుమార్ ప్రజాక్షేత్రంలో తలపడుతుండడంతో ఆయన ఆప్తులు, అభిమానులు, హితులు, సన్నిహితులు, స్నేహితులు సత్యకుమార్ విజయం కోసం శ్రమించడానికి సంసిద్ధులవుతున్నారు. సత్తా, సమర్థత, నిబద్ధత ఉన్న సత్యకుమార్ రాజకీయాలలో రాణించి ఉన్నత స్థానాలని అధిరోహించాలని ఆశిద్దాం. ఆల్ ది బెస్ట్ టు సత్య..!







లాయర్
మార్చి 29, 2024

# ‘ఆటిజం’... చిన్నారుల జీవితాలకు శాపం!

బాల్యం ఒక అద్భుతం. చిన్నతనంలో వారి ముద్దు మాటలు, అల్లరి చేష్టలతో తల్లితండ్రులు ఈ లోకాన్నే మరిచిపోతుంటారు. చిన్నపిల్లలంటే ఆ భగవంతుని స్వరూపాలుగానే భావిస్తుంటాం. అందుకే, ప్రతి మనిషికీ బాల్య దశ నిజంగా ఒక వరం. అయితే, అంతటి అపురూపమైన బాల్యావస్త అందరికీ ఒకేలాగా ఉండక, కొందరికి మాత్రం ఒక పెద్ద అవస్తగానే పరిణమిస్తుండడం బాధాకరం. మానసికంగా ఎదుగుదల లేక, వయసుకు తగ్గట్టు మానసిక పరిపక్వత లేకుండా, సరిగా మాట్లాడలేకపోవడం, వారికున్న ఎలాంటి అనుభూతులను ప్రకటించలేకపోవడం వంటి అనేక సమస్యలతో తల్లితండ్రులకు తీరని ఆవేదన కలిగిస్తుంటారు. పిల్లలకు వచ్చే రుగ్మతల్లో ఇలాంటిది చాలా అరుదైన సమస్య అని, అది నాడీ సంబంధిత రుగ్మతగా, చిన్నారులను బాల్యదశ నుంచే అనేకానేక కష్టాలకు గురిచేసే సమస్యగా వైద్యులు పరిగణిస్తుంటారు. వైద్య పరిభాషలో దీనిని ‘ఆటిజం’గా చెప్తూ, వందమంది పిల్లలో ఏ ఒక్కరికో ఇలాంటి సమస్య వస్తుందని, మానసికంగా ఎదుగుదలలో వస్తున్న లోపాలే ఇందుకు ప్రధాన కారణమని నిపుణులు చెప్తున్నారు. జన్యుపరంగా కూడా వచ్చే ఈ రుగ్మత వల్ల పిల్లలు ఆ తర్వాత కూడా సాధారణ జీవితాన్ని గడపలేని దుస్థితి ఎదురవుతుంది. ఈ ఆటిజమ్‌లో కూడా చాలా రకాలున్నాయి. ఆటిజమ్ సమస్య ఉన్న పిల్లలు సరైన ఎదుగుదల లేని స్థితిలో ఎవరితోనూ కలవకుండా ఒంటరిగానే ఉండడాన్ని ఇష్టపడుతుండడం, నేరుగా ఎవరి కళ్ళలోకీ చూడలేకపోవడం, చేసిన పనులనే మళ్ళీ మళ్లీ చేస్తుండడం, కారణం లేకుండా ఏడుస్తుండడం, ఎంతగా పిలిచినా పట్టించుకోకపోవడం, ఎంతచెప్పినా దేనినీ సరిగా అర్థం చేసుకోలేకపోవడం వంటివి ఈ ఆటిజమ్ రుగ్మత లక్షణాలు. అనేకమంది పిల్లలు పెరిగి పెద్దవారవుతున్నా ఈ సమస్య ఇలాగే ఉంటుంది. దీంతో వారి జీవితాలు ఇతర పిల్లల కంటే సమస్యాత్మకంగా ఉంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వారి పరిస్థితి, సమాజ జీవనం అన్నీ అంధకారబంధురంగానే ఉంటాయి. తరచుగా మూర్ఛకు గురవుతుంటారు. ఏదో తెలియని ఆందోళనతో కనిపిస్తుంటారు. అందువల్ల మానసికంగా ఎదుగుదల లేని పిల్లల పట్ల తల్లితండ్రులు కానీ, ఇతరులు కానీ వారిని కష్టపెట్టకుండా మానవీయ హృదయంతో ఆదరించాలి.

ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి సమస్య ఉన్న పిల్లలు అనేక దేశాల్లో గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. కొంత హెచ్చుతగ్గులుగా ఉన్నా, సగటున ఎంతమంది ఆటిజమ్ బాధితులున్నారో అని నిపుణులు లెక్కలు కడితే, అమెరికాలో ప్రతి 36 మంది పిల్లల్లో ఒకరు, దక్షిణ కొరియాలో ప్రతి 36 మందిలో ఒకరు, ఆస్ట్రేలియాలో ప్రతి 70 మందిలో ఒకరు, ఇటలీలో ప్రతి 166 మంది చిన్నారుల్లో ఒకరు... ఇలా అనేకదేశాల్లో ఎంతో కొంత శాతం మంది పిల్లలు ఈ ఆటిజమ్ బాధితులుగా ఉన్నారని తేలింది. మిగతా దేశాలతో పోలిస్తే మనదేశంలో ఆటిజమ్‌తో బాధపడే చిన్నారుల సంఖ్య తక్కువే. మన దేశంలో సుమారు 5 వందల మంది చిన్నారుల్లో ఒకరు వంతున మానసిక ఎదుగుదల లేక ప్రతినిత్యం ఎన్నో రకాల బాధలు పడుతున్నారని నిపుణుల అంచనా. స్త్రీలు గర్భధారణ సమయంలో ఉద్వేగాలకు లోనుకావడం, ఇన్‌ఫెక్షన్లు రావడం వంటివి, వారికి పుట్టే పిల్లలకు ఆటిజమ్ సమస్యను తెస్తుంటాయని కూడా వైద్యులు ధృవీకరించారు. పిల్లల ఎదుగుదల విషయంలో ప్రధానంగా పౌష్టికాహార లోపాన్ని నివారించడం, శిశువుకు తొలి ఆరునెలలు తల్లి పాలు మాత్రమే ఇస్తుండడం, పిల్లలకు వ్యాధి నిరోధకశక్తి పుష్కలంగా ఉండేలా వారికి పోషకాహారం ఇవ్వడం చాలా ముఖ్యమని కూడా వారి సూచన. మనదేశంలోనూ ఇలాంటి సమస్యతో విలవిలలాడుతూ, నరకప్రాయమైన జీవితాలను అనుభవిస్తున్నవారు ఎందరో ఉన్నారు. అలాంటివారిని ప్రభుత్వాలు కూడా గుర్తించి వారికి అన్నివిధాలా సాయపడాలి. మన మాటలను-చేతలను వారు అర్థం చేసుకునేలా.. వారి జీవితాల భద్రతకు ప్రత్యేక పథకాలను కొరతలేకుండా అమలుచేయడం వంటివి అత్యవసరం. మానసిక ఎదుగుదల లేని చిన్నారుల ఆరోగ్యపరిరక్షణకు, వారికి అవసరమయ్యే మందులు, చికిత్సలకు కూడా పూర్తి స్థాయిలో ఉదారంగా రాయితీలిచ్చి వారిని మామూలు మనుషులుగా తీర్చిదిద్దడం ప్రభుత్వాల మానవీయ కర్తవ్యం. అన్నిటికన్నా ముందుగా, ఆటిజమ్ సమస్యల పట్ల అందరూ అవగాహన చేసుకోవడం ముఖ్యం. మనమిచ్చే ఉత్సాహ ప్రోత్సాహాలే మన చిన్నారుల జీవితాల్లో వెలుగులవుతాయి. ఆత్మవిశ్వాసంతో భవితపై ఆశతో జీవించడమే మానవజీవిత పరమార్థం. ఆ విషయాన్ని అర్థం చేసుకోలేకపోతే మానసిక ఎదుగుదల లేని పిల్లలతో మనం కూడా సమానమే!...

- (ఏప్రిల్ 2.. అంతర్జాతీయ ‘ఆటిజం అవగాహన’ దినోత్సవం)



## సత్యపీఠం

నిజాలే మాట్లాడుకుందాం! 31

# మద్యాన్ని నమ్ముకున్నా.. అమ్ముకున్నా కష్టాలు తథ్యం!

‘మద్యం’ మనదేశంలో కోట్లాదిమంది పేద కుటుంబాలను, వారి సంసారాలను గుల్లచేస్తున్న ఒక మహమ్మారి. మద్యం తాగితే కలిగే మత్తుకు బానిసలైన ఎంతోమంది తమ భార్యాబిడ్డలను, వారి జీవితాలను కూడా అంధకారబంధురం చేస్తున్నారు. మద్యం తాగడమన్నది ధనికవర్గాలవారికే కాదు, పేద మధ్యతరగతి వారికి కూడా ఒక ఫ్యాషనైపోయింది. “పొగత్రాగని వాడు దున్నపోతై పుట్టున్” అని కన్యాశుల్కంలో గిరీశం చెప్పినట్లుగా “మద్యం ముట్టని వాడు... అదేదోగా పుడతాడు” అన్న మాటలని కూడా మద్యపాన ప్రియులు వాడుకలోకి తెస్తున్నారు. కనీసం అప్పుడప్పుడైనా ఓ రెండు పెగ్గులు వేసుకునే అలవాటు లేనివాడు పనికిరాని బడుద్దాయిగా నేటి సమాజం లెక్కకట్టే పరిస్థితులు దాపురించాయి. నిత్యం మనదేశంలో కోట్లాదిమంది మద్యం తాగుతూనే ఉన్నారు. తాగకపోతే నిద్ర పట్టనివారు కోకొల్లలుగానే ఉంటున్నారు. మందు ఒక బలహీనతగా మారింది. దీనిని మాన్పించడం దానిని కనిపెట్టిన వాడి తరం కూడా కాదు. నిరుపేదలైన కోట్లాదిమంది కార్మికులు, బడుగు బలహీనవర్గాల వారు కూడా సాయంత్రానికి తాగకుంటే, మరుసటి రోజు పనిచేయలేమబ్బా అనుకుని, ఆరోజు సంపాదన కాస్తా తాగుడుకు తగలపెట్టేసి గుర్రుపెట్టేస్తున్నారు. మద్యం ఒక మాయలమారిగా, రాకాసిగా మారి వారి జీవితాలలోఒక భాగమైపోయింది. అటు ఆరోగ్యాన్ని, ఇటు వారి కుటుంబ వ్యవస్థని కూడా నాశనం చేసేస్తోంది. అందుకే, మద్యాన్ని బాగా తగ్గించేయడమో లేకుంటే వీలైతే మద్యనిషేధాన్ని అమలు చేయడమో ఉత్తమమని మన నాయకులు అప్పుడప్పుడూ ఊకదంపుడు ఉపన్యాసాలతో ఉదరగొడుతుంటారు. ఉపన్యాస వేదిక దిగిన వెంటనే ఇంటికో గెస్ట్‌హౌస్‌కో వెళ్లి తాము కూడా ఓ క్వార్టర్ బిగించి నిద్రపోతుంటారు. మద్యంతోనే బోలెడంత ఆదాయం వస్తున్నప్పుడు, ఆ ఆదాయంతోనే బటన్ నొక్కుడు పథకాలు అమలు చేస్తున్నప్పుడు, దాన్ని నిషేధించడమన్నది ప్రభుత్వాలకు అసాధ్యమే.

### మద్యం వ్యాపారంలో ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు

మద్యంతో వ్యాపారం ఓ వైపు వ్యాపారస్తులకు కోట్లాది రూపాయలు ఆర్జించిపెడుతున్నా, మరోవైపు వారిని చిక్కుల్లో కూడా పడేస్తోంది. ప్రజల చేత మద్యం మాన్పించాల్సిన ప్రజాప్రతినిధులే సారా వ్యాపారంలో దిగి చిక్కుల్లో పడుతున్నారు. మద్యం ఎంత చెడ్డది అనుకున్నా, మనదేశంలో అనేకమంది పెద్దపెద్ద రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు ఈ వ్యాపారాలు చేస్తూ కోట్లాది రూపాయలు వెనకేసుకుంటుండడం చూస్తూనే ఉన్నాం. ప్రభుత్వాధినేతలు కూడా మద్యం వ్యాపారం చేసేవారిని ఎప్పుడూ ఓ కంట కనిపెడుతూనే ఉంటారు. ఓవైపు మద్యాన్ని ప్రభుత్వ ప్రధాన వనరుగా మార్చుకుంటూనే మరోవైపు ఆ వ్యాపారం చేసేవారిని తమ సొంత ఖర్చుల కోసం వేధిస్తూనే ఉంటారు. తమకు ఎప్పుడు అవసరం ఏర్పడితే అప్పుడు వారిపై దండయాత్రలు చేస్తుంటారు. దొరికినంత లాగేసుకుంటుంటారు.

మద్యం ఒక మహమ్మారిగా మారి జన జీవితాలు నాశనం చేస్తున్నా, మనదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలే దర్జాగా మద్యం వ్యాపారం చేస్తున్నాయి. ప్రభుత్వ నిధులకి గండి పడకుండా ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడుపుతోందని పైకి ప్రకటిస్తున్నాయి. లోపల మాత్రం మద్యం సామ్రాజ్యాన్ని తమ చెప్పు చేతల్లో పెట్టుకుని లక్షల కోట్ల రూపాయల అక్రమ సంపాదనకు తమ అనుయాయుల ద్వారా పథకం రచించి దోచుకుంటున్నాయి. అనాదిగా వస్తున్న మద్యం బ్రాండ్లకు అడ్డుకట్ట వేసి తమ సొంత బ్రాండ్లని మార్కెట్లోకి దించి లక్షల కోట్లు గడుస్తున్నాయి. ఉదాహరణకి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే గడచిన ఐదేళ్లలో చిత్ర విచిత్రమైన పేర్లతో వందలాది రకాల కొత్త మద్యం సీసాలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో వీటి పేర్లు కూడా వినని మద్యపానప్రియులు గత్యంతరం లేక వాటినే కొని తాగి వూగుతున్నారు.

### చిక్కుల్లో నేతలు

ముఖ్యమంత్రులు, వారి కూతుర్లు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వారి వారసులు మద్యం వ్యాపారం వైపు మొగ్గు చుపిస్తున్నారంటే ఈ వ్యాపారంలో ఏ స్థాయిలో లాభాలు వస్తున్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తాజాగా దేశంలో జరిగిన పరిణామాలు రోజు వార్తలలో చూస్తూనే వున్నాం. సాక్షాత్తు దేశ రాజధానిని పరిపాలిస్తున్న ముఖ్యమంత్రే మద్యం కుంభకోణంలో జైలు పాలయ్యారు. “ఈడీ లేదు బోడి లేదు” అని అత్యున్నత దర్యాప్తు సంస్థని అవహేళన చేసిన తెలంగాణా మాజీ ముఖ్యమంత్రి కుమార్తె కూడా ఇప్పుడు ఊచలు లెక్కపెడుతోంది. ప్రభుత్వాల్లో పాలకులుగా ఉన్న వారు కూడా మద్యంతో వ్యాపారం చేయడం ఏమిటి? ఆ వ్యాపారులతో లాలూచీలు పడడం ఏం సంప్రదాయం?.. ఇంతకన్నా దౌర్భాగ్యం ఇంకేమైనా ఉందా? అని ప్రశ్నించే సామాన్యుడి ప్రశ్నలకు సమాధానాలు దొరకవు. అనాదిగా మద్యం వ్యాపారంలో ఉంటూ కోట్లు గడిస్తున్న వారిని పక్కన పెట్టి ప్రజాప్రతినిధులే నేరుగా ఆ వ్యాపారంలో దిగడం ఘోరం. తమని పరిపాలించమని ప్రజలు అధికారం కట్టబెడితే, ఆ అధికారాన్ని అడ్డం పెట్టుకుని వ్యాపారులను బెదిరించి అక్రమ సంపాదన కోసం కక్కుర్తిపడడం హేయమైన చర్య.

అటు తాగేవారిని, ఇటు తాగించేవారిని, తయారుచేసేవారిని, వ్యాపారాలు చేసేవారినే కాక, నాయకులను, ప్రభుత్వాలనేలుతున్న ప్రజాప్రతినిధులను కూడా ఈ మందు మహమ్మారి గగ్గోలు పెట్టిస్తోంది. మద్యం రాకాసి కోరలకి చిక్కి సామాన్యులు బలవుతుంటే, నీతులు చెప్పే నాయకులు కూడా డబ్బు వ్యామోహంతో మద్యం వ్యాపార మత్తులో పడి కొట్టుకుంటున్నారంటే ఇంతకంటే ఘోరం, నీచం ఇంకొకటి లేదు. మద్యం తాగేవారైనా, మందు వ్యాపారం చేసి కోట్లు గడించాలనుకున్న వారైనా ఎవరైనా సరే బాధలు పడాల్సిందే. మత్తు కోసం మందుని నమ్ముకున్న వారికీ కోట్ల కోసం మద్యం అమ్ముకునే వారికీ.. ఇద్దరికీ కష్టాలు మాత్రం తథ్యం!

- రాజశ్రీ

హరనాథపురాన్ని విద్యానగర్‌గా మార్చిన

# స్టార్ మాస్టర్ మా రత్నం సారు!

రత్నం గారు నిజంగా విద్యా రత్నమే. వారు సార్ధక నామధేయులు. ఉన్నత విద్యావంతులు, సమాజ సేవాతత్పరులు, మంచితనానికి మారుపేరు, దానానికి, విద్యా దానానికి వారు చక్కటి ఉదాహరణ. కోచింగ్ సెంటర్‌లకు ఆయన ఆద్యులు, పూజ్యులు. ఆంధ్రరాష్ట్రంలోనే తొలిసారిగా 1983 సంవత్సరంలో కోచింగ్ సెంటర్ స్థాపించారు. విద్యకు బ్రాండ్ అంబాసిడర్ రత్నం మాస్టారు. హరనాథపురాన్ని విద్యానగర్‌గా మార్చివేశారు. వేలాదిమందిని డాక్టర్లుగా ఇంజనీర్లుగా తయారుచేశారు. కె.వి.రత్నం గారితో నా అనుబంధం 50 ఏళ్ల నాటిది. నేనూ, మా అబ్బాయి, అమ్మాయి అందరమూ డాక్టర్లమే. అందరమూ మాస్టారు గారి స్టూడెంట్లమే. వారి వద్ద చదువుకోవడం మా పూర్వజన్మ సుకృతం. మా మాస్టారు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

డాక్టర్ ఎం. పెంచలరెడ్డి, నెల్లూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

తప్పు చేసిన వాళ్ళే...

# దైవ కార్యక్రమాలు చేస్తారా?

ఇటీవల నెల్లూరు నగర శాసనసభ్యుడు అనిల్‌యాదవ్, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులని ఉద్దేశించి చేసిన కామెంట్లు హాస్యాస్పదంగానే కాదు వివాదాస్పదంగా కూడా ఉన్నాయి. రాజకీయాలలో విమర్శలు, ప్రతి విమర్శలు సర్వసాధారణమే. కానీ, ఇటీవల కాలంలో వాటి స్థాయి హద్దు మీరుతోంది. నాయకులపైన అసహ్యం కలుగుతోంది. ప్రభాకరరెడ్డి గారు గత ముప్పై ఏళ్ళకి పైగా అటు సేవారంగంలోనూ ఇటు ఆధ్యాత్మిక రంగంలోనూ తమ సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. వారు సేవా రంగంలో అడుగుపెట్టే నాటికి నేటి తరం నాయకులు చడ్డీలు వేసుకుని తిరిగేవారేమో. ఈ నయా నేతలు వీపీఆర్‌ని విమర్శిస్తుంటే నవ్వొస్తుంది. పైగా పాపాలు చేసినవారే దైవ కార్యక్రమాలు చేస్తారని క్రమం తప్పకుండా అయ్యప్ప మాల వేసుకునే వారు అంటుంటే.. వారి మానసిక స్థాయిపైన అనుమానం కలుగుతుంది. రాజకీయ విమర్శల కోసం వ్యక్తిగత జీవితాన్ని లక్ష్యం చేసుకుని మాట్లాడడం మంచి సంప్రదాయం కాదు. పైగా దైవ కార్యక్రమాల గురించి అసందర్భ విమర్శలు చేయడం ప్రజల మనోభావాలపై బురద చల్లడమే. జగన్‌మోహన్‌రెడ్డి, పవన్ కళ్యాణ్ భార్యల గురించి మాట్లాడి తమ పార్టీ నాయకులకి ఆదర్శంగా నిలిచినట్లుంది. వ్యక్తుల వ్యక్తిగత జీవితంలోకి తొంగిచూసి విమర్శించడం అన్నది ఎవరు చేసినా తప్పే!

లక్ష్మీ భరద్వాజ్, హైదరాబాదు.

# నీటి కష్టాలపై దృష్టి పెట్టాలి

ఎండాకాలం అప్పుడే భగ్గుమంటోంది. పల్లెల్లో, పట్టణాల్లోనే కాదు, నగరాల్లో కూడా దాహార్తి పెరిగిపోతోంది. జిల్లాలో మంచి నీటి చేతిపంపులు అనేక గ్రామాల్లో తుప్పు పట్టివున్నాయి. కుళాయిల్లో మంచినీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. ముందస్తుగానే వీటినన్నిటినీ చక్కదిద్దాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడం విచారకరం.

- కె.ఎస్ శ్యామలాంబ, గూడూరు.

# ఓం శాంతి..!



"గురు బ్రహ్మ, గురు విష్ణు
గురు దేవో మహేశ్వరః
గురు సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః"

## రత్నం మాస్టారు గారి

ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

**పొంగూరు నారాయణ**
వ్యవస్థాపకులు
**నారాయణ విద్యాసంస్థలు**
భారతదేశం

# విజయసాయిరెడ్డివన్నీ అబద్ధాలే

**- ఆనం వెంకటరమణారెడ్డి**



తనకు వ్యాపారాలు లేనేలేవంటూ విజయసాయిరెడ్డి చెప్పే మాటలన్నీ పచ్చి అబద్ధాలని, జగన్‌మోహన్‌రెడ్డి కంపెనీల్లో ఆయనకు వాటాలు లేవా?.. దొంగ కంపెనీలు పెట్టి వేల కోట్లు దోచుకో లేదా?.. అంటూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి దుయ్యబట్టారు. ఈనెల 26న నెల్లూరులోని ఎన్టీఆర్‌భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖపట్టణాన్నంతా కబ్జాచేసిన విజయసాయిరెడ్డి ఇప్పుడు ఎన్నికల కోసమని నెల్లూరుకు వచ్చారు..రిషికొండలాంటి పెద్దపెద్ద కొండలనే మింగేశారు. నెల్లూరు ప్రజలారా మీ భూములు జాగ్రత్త!.. అంటూ హెచ్చరించారు. విజయసాయిరెడ్డి ఎంపీగా ఉంటూ గత పదేళ్లలో రూ.50 కోట్ల ఎంపీల్యాడ్స్‌లో నెల్లూరు కోసం ఎంత ఖర్చుపెట్టారో చెప్పాలని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు.

# ముస్వర్ మృతి బాధాకరం

**--- విచారం వ్యక్తం చేసిన నేతలు ---**

నెల్లూరు జెండావీధికి చెందిన మంచి నాయకుడు, సేవాతత్పరుడు, వక్ఫ్‌బోర్డు మాజీ ఛైర్మన్ షేక్ ముస్వర్ మృతి బాధాకరమని టీడీపీ నాయకులు ఆవేదన చెందారు. ఈనెల 26న టీడీపీ నేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీమంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, రూప్‌కుమార్ తదితరులు ముస్వర్ నివాసంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంభసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా వైకాపా నేతలు విజయసాయిరెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నగర వైకాపా అభ్యర్థి ఖలీల్ అహ్మద్ తదితరులు ఆయనకు నివాళులర్పించి, ముస్వర్ లేని లోటు తీరనిదని విచారం వ్యక్తం చేశారు.

# యువతకు భవిత ఏదీ?..

**- తెలుగు మహిళ నాయకురాలు పనబాక భూలక్ష్మి**



వైకాపా ప్రభుత్వం యువతకు భవిత లేకుండా చేసిందని, డ్రగ్స్ మాఫియా యువతను నాశనం చేస్తోందని తెలుగు మహిళ నాయకురాలు పనబాక భూలక్ష్మి విమర్శించారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆమె ఈనెల 26న విలేకర్లతో మాట్లాడుతూ, చంద్రబాబు రాష్ట్రాన్ని పరిశ్రమలు పెట్టుబడులతో నెం.1 స్థానానికి చేర్చితే, వైకాపా అధికారంలోకి వచ్చాక జగన్ రాష్ట్రాన్ని డ్రగ్స్‌లో నెం.1గా చేశారని విమర్శించారు. యువత భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## నెల్లూరు కబుర్లు

# రంగనాథస్వామికి.. టీటీడీ పట్టువస్త్రాలు



నెల్లూరులోని ప్రసిద్ధమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. నిత్యం వేలాదిమంది భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ఈనెల 26న స్వామివారి కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానాల వారు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. టీటీడీ డెప్యూటీ ఇఓ లోకనాథం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఘనంగా సోమిరెడ్డి పుట్టినరోజు వేడుకలు



టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి, సర్వేపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఈనెల 26న ఘనంగా జరిగాయి. నెల్లూరులోని వేదాయపాళెం వద్ద ఉన్న సోమిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో భారీ కేకు కట్‌చేయించి అందరికీ పంచిపెట్టారు. జిల్లావ్యాప్తంగా అనేక మంది టీడీపీ నాయకులు, సోమిరెడ్డి అభిమానులు, సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి పూలబొకేలతో సోమిరెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. వారందరినీ పేరుపేరునా సోమిరెడ్డి ఆత్మీయంగా పలకరించి ధన్యవాదాలు తెలిపారు.

# అర్చకులపై దాడి దారుణం

కాకినాడ శివాలయంలో అర్చకులపై దాడి దారుణమని, దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యులు సుధా రవీంద్ర పేర్కొన్నారు. ఈనెల 26న ఆమె బాలాజీనగర్‌లోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, అర్చకులపై అమానుషంగా దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బ్రాహ్మణులను వేధిస్తున్న వైకాపాను రానున్న ఎన్నికల్లో ఓడించాలని ఆమె బ్రాహ్మణ సామాజిక వర్గానికి పిలుపునిచ్చారు.

# నిర్భయంగా ఓటేయండి



రానున్న ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని నెల్లూరులోని వేదాయ పాళెం పోలీస్ ఇన్స్‌పెక్టర్ వీవీ నారాయణ కోరారు. ఈనెల 26న ఆయన ఓటర్లకు భరోసా కల్పించేందుకు బుజబుజనెల్లూరు, శాంతినగర్, వేదాయపాళెం తదితర ప్రాంతాల్లో బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసులతో కలసి కవాతు నిర్వహించి, ఓటర్లకు అవగాహన కలిగించారు.

**ఏపీజీఇఏ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా..**

# ఏనుగ రమణారెడ్డి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఇఏ) రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నెల్లూరుజిల్లాకు చెందిన ఏనుగ రమణారెడ్డి ఇటీవల నియమితులయ్యారు. ఉద్యోగుల కోసం రమణారెడ్డి చేస్తున్న సేవలను గుర్తించి ఆయన్ను రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్ సూర్యనారాయణ తెలిపారు. విజయవాడలో ఈనెల 24న రమణారెడ్డిని ఆయన అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులురెడ్డి, జిల్లాశాఖ అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, పివిఎస్‌టి రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జక్కా వెంకయ్య కుమార్తె..శారదమ్మ కన్నుమూత



సీపీఎం సీనియర్ నాయకుడు, నెల్లూరు జిల్లా మార్క్సిస్టు ఉద్యమ నిర్మాత దివంగత జక్కా వెంకయ్య కుమార్తె శారదమ్మ (63) ఈనెల 26న మంగళవారం వేకువన అనారోగ్యంతో కన్నుమూశారు. జక్కా వెంకయ్య–పార్వతమ్మ దంపతులకు ఆమె నాల్గవ సంతానం. బుచ్చిరెడ్డిపాళెం దామరమడుగు గ్రామంలో ఆమె జన్మించారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. ఆమె మృతికి బాధను వ్యక్తం చేస్తూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా నాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, ఎం. మోహన్‌రావు, చంద్ర రాజగోపాల్, కత్తి శ్రీనివాసులు తదితరులు నివాళులర్పించారు. నెల్లూరు ఏసీనగర్‌లోని ఆమె నివాసంలో శారదమ్మ భౌతికకాయాన్ని బుధవారం పలువురు నాయకులు సందర్శించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

# 'తంగిరాల మహాభారతం'

**94వ భాగం**




అలా నలమహారాజు దమయంతిని వదిలి వెళ్ళిపోయిన తర్వాత ఆమె లేచి నలుడు కనపడకపోతే బిత్తరపోయి, ఆ అడవిలో పిచ్చిదానిలా తిరుగుతుంటే... ఒక వేటగాడు ఆమెను ఒక కొండచిలువ నుంచి రక్షిస్తాడు. కానీ, ఆమెను తమకంగా చూస్తున్నాడని దమయంతి తన శాపంతో అతన్ని నిర్జిస్తుంది. కొంతమంది మునీశ్వరులు కనపడి ఆమెకు అభయమిస్తారు.

ఒక వర్తకుల గుంపుతో పాటు ప్రయాణించి దారిలో ఏనుగుల దాడి నుంచి తప్పించుకుని, కొంతమంది బ్రాహ్మణులతో చేధి రాజధాని చేరుకొని, ఆ దేశ రాజమాత అనుగ్రహంతో ఆ అంతఃపురంలో ఆశ్రయం పొందుతుంది.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.






# ధర్మనిరతికి ప్రతీక..నల చక్రవర్తి



ధర్మనిరతికి ప్రతీకగా చరిత్రలో శాశ్వతంగా నిలచిపోయిన నల చక్రవర్తి ఆదర్శ ప్రాయుడని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని సహస్ర శతావధాని డాక్టర్ సూరం శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 24న నెల్లూరు టౌన్‌హాలులోని ఏసీ హాల్‌లో బ్రహ్మశ్రీ పోలూరు హనుమజ్జానకీరామశర్మ శతజయంతి ఆధ్యాత్మిక ప్రవచనాల్లో భాగంగా డాక్టర్ సూరం 'నల చరిత్ర'పై అద్భుతంగా ప్రవచించి అందరి ప్రశంసలందుకున్నారు. నలచరిత్ర మహాభారతంలోని వనపర్వంలో ఉందని పేర్కొంటూ, ప్రతిఒక్కరూ తెలుసుకోవాల్సిన అంశాలు అందులో ఎన్నో ఉన్నాయన్నారు. అనంతరం 'శ్రీ రామావతార వైభవం' గ్రంథాన్ని ఆవిష్కరించారు. పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్ట రామచంద్రప్రసాద్, చీమకుర్తి వెంకటేశ్వర్లు, నలుబోలు బలరామయ్యనాయుడు, వేదం రాధాకృష్ణమూర్తి, గంగిశెట్టి శివకుమార్, కోట రాజశేఖర్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన చేనేత నాయకులు

నెల్లూరుకు చెందిన పలువురు చేనేత ప్రముఖులు ఈనెల 26న విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు శీపా వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేనేత నాయకులు కేవీ శేషయ్య, పులి కిషోర్‌బాబు, గుంటి కిషోర్, రాజా, కోటేశ్వరరావు, శివకుమార్‌లు కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ నాయకులు వాకాటి నారాయణరెడ్డి, పి.సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 30 నుంచి.. శ్రీ త్యాగరాజస్వామి స్మరణోత్సవాలు

## • భక్తిగానాలతో పులకించనున్న టౌన్‌హాల్ ప్రాంగణం



*నెల్లూరు ఆధ్యాత్మికరంగానికి మరింత శోభను తెస్తూ, శ్రీ సీతారాముల స్వామివార్లను, సద్గురు శ్రీ త్యాగరాజస్వామిని భక్తితో ప్రార్ధించుకుంటూ, నగరాన్ని శ్రీ త్యాగరాజస్వామి సంకీర్తనల గానంతో పులకింపజేస్తూ దాదాపు అర్ధశతాబ్దానికి పైగానే నెల్లూరును మరో తిరువయ్యూర్‌గా ప్రఖ్యాతి తెచ్చిన భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు మార్చి 30 నుంచి స్థానిక టౌన్‌హాలులో వైభవంగా జరుగనున్నాయి. నెల్లూరు సీమకే ఎనలేని కీర్తి తెచ్చిన ఈ ఉత్సవాలను శ్రీ త్యాగరాజస్వామి ఆరాధకులు గత 59 సంవత్సరాలుగా కొనసాగిస్తూనే ఉండడం విశేషం.*

### నాటి పుణ్యమూర్తుల కృషితో.. నేటికీ సంగీతోత్సవాలు :



'సంగీత జ్ఞానము.. భక్తి వినా.. సన్మార్గము కలదే మనసా' అంటూ శ్రీ త్యాగరాజస్వామి సంకీర్తనలను అనన్యభక్తితో పాడుకుంటూ, జోలె కట్టి–భిక్ష ఎత్తి సంగీత సేవకై తపించిన నాటి పుణ్యమూర్తులు కీర్తిశేషులు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి అయ్యవారు (ప్రఖ్యాత గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తండ్రిగారు), ఆయన స్నేహితులు దివంగత డాక్టర్ యనమండ్ర వేంకటేశ్వర శాస్త్రిల విశేషకృషితో నెల్లూరులో 'భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ' ఏర్పడిందనే విషయం సింహపురి సీమవాసు లందరికీ తెలిసిన విషయమే. వారి తర్వాత, ఈ స్మరణోత్సవ సభకు ప్రస్తుతం గౌరవాధ్యక్షులుగా కీ.శే సాంబమూర్తి మనుమడు.. ఎస్పీ బాలు తనయుడు..ప్రముఖ గాయకుడు ఎస్పీ చరణ్, శాశ్వత కార్యదర్శిగా యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రి కుమారుడు నాగదేవి ప్రసాద్‌ల నేతృత్వంలో ఈ సంగీతోత్సవాలు నెల్లూరు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందిస్తూనే ఉన్నాయి. స్మరణోత్సవ సభ అధ్యక్షులు చతుర్వేదుల శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షులు దేవలపల్లి శ్రీరామచంద్ర మూర్తి, వంజూరి శ్రీనివాసమూర్తి, టిఆర్ చంద్రమౌళి, అన్నవరం సత్యనారాయణ, అవధానం రామప్రసాద్, కోశాధికారి ఎస్. నాగేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్‌వి మల్లికార్జునరావు, జాయింట్ సెక్రటరీలు డా.ఎస్ సాయినాథ్, పామర్తి బలరామ్‌లతో పాటు మరో 34 మంది కమిటీ సభ్యుల సారథ్యంలో ఈ ఉత్సవాలను నేటికీ కన్నులపండువగా నిర్వహిస్తుండడం విశేషం. మార్చి 30 నుంచి ఏప్రిల్ 5వతేదీ వరకు జరిగే 59వ స్మరణోత్సవాల్లో జిల్లా నుంచే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా ఎందరో భక్తిసంగీత గాయకులు, సంగీతవేత్తలు, గాయనీమణులు, వాద్యకారులు, హరికథాగాన కళాకారులు విచ్చేసి తమ మధుర గానాలతో భక్తాదులను మైమరపింపజేయనున్నారు.

### 30న శ్రీ సీతారాముల ఊరేగింపు..విగ్రహ ప్రతిష్ట

ఈనెల 30వ తేది ఉదయం 7 గంటలకు స్థానిక వేదాయ పాళెంలోని త్యాగరాజస్వామి మందిరం నుంచి శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ త్యాగరాజస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి టౌన్‌హాల్ వెనుకవైపు ఉన్న వేదికపై ప్రతిష్టించి పూజలు చేస్తారు. అనంతరం, భక్తి సంగీత కార్యక్రమాలను వేడుకగా నిర్వహిస్తారు. కావలికి చెందిన ప్రముఖ హరికథా గానకళాకారుడు వి.బాలకృష్ణ భాగవతార్ ఆధ్వర్యంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు 'సతీ సక్కుబాయి' హరికథాగానంతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. నగరప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని స్మరణోత్సవాల సభ కార్యదర్శి యనమండ్ర నాగదేవిప్రసాద్ విజ్ఞప్తి చేస్తున్నారు.

## జొన్నవాడ కామాక్షమ్మ సన్నిధిలో..

# వేమిరెడ్డి దంపతుల పూజలు



రానున్న ఎన్నికల్లో నెల్లూరు టీడీపీ పార్లమెంట్, కోవూరు శాసనసభ అభ్యర్ధులుగా పోటీలో ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి–వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఈనెల 24న జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి దేవస్థానాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కోవూరు టీడీపీ నాయకుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డితో పాటు స్థానిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కేంద్రంలో మోడీ..రాష్ట్రంలో బాబు గెలవడం ఖాయం

**- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ పక్షాన విజయం సాధించి కేంద్రంలో ప్రధానిగా నరేంద్ర మోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు పీఠాలను అధిష్టిస్తారని, వారి గెలుపు ఖాయమని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్ధి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 24న నెల్లూరులోని ఎంవిఎస్ కల్యాణ మండపంలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఎన్‌డిఏ ప్రభుత్వాలు రానుండడం జిల్లాకు, రాష్ట్రానికి శుభపరిణామమన్నారు. ప్రతిఒక్కరూ కలసికట్టుగా టీడీపీ–బీజేపీ–జనసేన ఉమ్మడి అభ్యర్ధులను భారీస్థాయి మెజార్టీతో గెలిపించాలని, నెల్లూరు పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న తనను ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ శాసనసభ అభ్యర్ధి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, శీపా వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గురువులకే గురువు..!

రాష్ట్ర విద్యా రంగంలో నవశకానికి సారథి
అనేక విద్యాసంస్థల ఆవిర్భావానికి వారధి
చదువుల తల్లి సేవలో తరించిన నాలుగుతరాల పెన్నిధి

విద్యా రంగానికి పెద్దదిక్కుగా నిలచిన ఆదిగురువు
రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు
కే.వీ.రత్నం గారి
పవిత్ర ఆత్మకి శాంతి కలగాలని కోరుకుంటూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.



పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి
శాసనమండలి సభ్యులు
వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు



# జగనే మళ్ళీ ముఖ్యమంత్రి

## ఆదాల ప్రభాకర్‌రెడ్డి ధీమా

రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం, పేద-బడుగు వర్గాల ప్రజానీకం అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఆ అభివృద్ధిని చూసి ప్రజలు ఓటేయాలని, మళ్ళీ జగన్‌మోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని నెల్లూరు రూరల్ వైకాపా అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఈనెల 27న రూరల్ నియోజక వర్గంలో పలు ప్రాంతాల్లోని ప్రజలను ఆయన కలుసుకుని వైకాపా ప్రజలకు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత పది నెలల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోట్లాదిరూపాయల వ్యయంతో ఎన్నో అభివృద్ధిపనులు చేశామని, రూరల్‌ను మోడల్ నియోజకవర్గంగా మరింత అభివృద్ధి చేసి నెంబర్-1గా చేస్తామని ఆయనన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రజలు వైకాపాను గెలిపించుకోవాలని, రానున్న ఎన్నికల్లో రూరల్ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనను ఆదరించి ఆశీర్వదించాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా వైకాపా పట్ల అభిమానంతో ఉన్నారని, జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. సంక్షేమం-అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఇరుకళల అమ్మవారి దేవస్థానం ఛైర్మన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్), స్థానిక నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు.

# అభివృద్ధి కావాలంటే.. వైకాపాను గెలిపించుకోవాలి

## - విజయసాయిరెడ్డి



రాష్ట్రంలో అభివృద్ధి-సంక్షేమం కావాలంటే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని గెలిపించుకోవాలని రాజ్యసభ సభ్యుడు, వైకాపా నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి చెప్పారు. ఈనెల 23న ఆయన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డితో కలసి బుచ్చిరెడ్డిపాళెం మండలం పంచేడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, తాను ఈ జిల్లాలోనే పుట్టానని, జిల్లాపై పూర్తి అవగాహన ఉందని, ప్రత్యేక ప్రణాళికతో జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. కొందరు నాయకులు ధనాశతో పార్టీని వీడిపోయారని ఆయన ఆరోపిస్తూ, ఎంత డబ్బు పెట్టినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆరాధించే ప్రజలను కొనడం ఎవరి తరం కాదన్నారు. రానున్న ఎన్నికల్లో వైకాపా విజయం తథ్యమన్నారు. విలువలు, విశ్వసనీయత కలిగిన విజయసాయిరెడ్డిపై వేమిరెడ్డి విమర్శలు హాస్యాస్పదమని ఎమ్మెల్యే ప్రసన్న అన్నారు. తొలుత, జొన్నవాడలోని శ్రీ కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్సీ కల్యాణ్‌చక్రవర్తి, నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేను మీ ఇంటి ఆడపడుచుని

## నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి చెల్లెలి కోడలిగా ఈ జిల్లాలో అడుగుపెట్టా
## విధివశాత్తు భర్త శాశ్వతంగా దూరమవడంతో మళ్ళీ పెళ్లి చేసుకున్నా..!

### - కోవూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న వార్తలపై కోవూరు అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఘాటుగా స్పందించారు. తనపై వస్తున్న విమర్శలకి తానే సూటిగా సమాధానం చెప్పారు. కోవూరు నియోజకవర్గంలో వేమిరెడ్డి దంపతులు ఇటీవల నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ ప్రభంజనం సృష్టించింది. అతిరథ మహారథుల సమక్షంలో, జిల్లా నాయకులు, వేలాదిమంది కార్యకర్తల మధ్య సభ.. విజయోత్సవ సభను తలపించింది. కోవూరు జాతీయ రహదారి పక్కన ఉన్న నెల్లూరు గ్రాండ్ హోటల్ సమీపంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ సభలో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలకు ప్రజల నుంచి భారీ స్వాగతం లభించింది.

### మీ ఇంటి ఆడపడుచుగా మీముందుకు వచ్చా.. ఆశీర్వదించండి - ప్రశాంతిరెడ్డి

ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, కోవూరు ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. 'మీ ఇంటి ఆడపడుచుగా మీ ముందుకు వచ్చినప్పుడు నా గురించి మీరు తెలుసుకోవాలి'.. అంటూ చెమ్మగిల్లిన కళ్లతో తన గతాన్ని వివరించారు. తాను చిత్తూరుజిల్లాలో పుట్టానని, జిల్లాకి చెందిన సీనియర్ రాజకీయవేత్త నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి చెల్లెలు



హైమావతమ్మ కోడలుగా వెళ్లిన ఇంటికే.. తాను ఆమెకి కోడలిగా వెళ్లానని చెప్పారు. అయితే, విధివశాత్తు తన భర్త తనకి శాశ్వతంగా దూరమయ్యారని, ఆ తర్వాత దైవ సంకల్పం, కుటుంబసభ్యుల అంగీకారంతో సేవామూర్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని వివాహం చేసుకున్నానని సభా ముఖంగా చెప్పారు. తన కుటుంబసభ్యులు, అత్తగారి ఇంటి సభ్యుల అనుమతితో తమ పెళ్లి జరిగిందని వివరించారు. తన వ్యక్తిగత జీవితంలోకి తొంగిచూసి చట్టపరంగా జరిగిన తన పెళ్లిపై రాద్ధాంతం చేయడం సిగ్గుచేటైన విషయమన్నారు. రానున్న ఎన్నికల్లో కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ఆడపడుచుని గెలిపించుకోవాలని ఆమె అభ్యర్థించారు. కోవూరుకు కొత్త నాయకత్వం అవసరమని, తప్పకుండా కోవూరు ప్రజలు తనను గెలిపిస్తారన్న నమ్మకం తనకుందని అన్నారు. తాము ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చామన్నారు. తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరు ఎంపీగా గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు.

### ప్రజలవద్దకే పాలన తెస్తాం

#### - విపిఆర్

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) మాట్లాడుతూ బలమైన ఆర్థిక స్తోమతతో రాజకీయాలలోకి వచ్చానని ఇటీవల కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. అది వాళ్ళ కర్మ అని, అన్నీ ఆ దేవుడే చూసుకుంటాడని చెప్పారు. మంచి పనులు చేసేందుకే భగవంతుడు తనకు ధనమిచ్చాడని అన్నారు. అందుకే దేవుడిచ్చిన ధనాన్ని ప్రజల కోసం వినియోగిస్తున్నానని ఆయన వినమ్రంగా చెప్పారు. తాము సేవాభావంతోనే రాజకీయాల్లోకి వచ్చామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆశీస్సులతో తాము గెలిస్తే, ప్రతి మండలంలో కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు. ప్రజల వద్దకే పాలన తెచ్చి, ఎంపీ, ఎంఎల్ఏ అంటే ఇలా ఉండాలి అనే విధంగా సేవ చేసి ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడతామని తెలిపారు.

# స్మార్ట్ ప్లానింగ్ ద్వారా సుస్థిరమైన అభివృద్ధి

## - అంతర్జాతీయ సెజ్ పాలసీ ఫోరమ్‌లో.. శ్రీసిటీ ఎం.డి డా.రవీంద్ర సన్నారెడ్డి ప్రసంగం



సెజ్‌లు, ఎగుమతుల ప్రోత్సాహక మండలితో కలసి సెజ్‌లపై పరిశోధనలు చేసే అంతర్జాతీయ విద్యా సంస్థల వేదిక ఈనెల 26న న్యూఢిల్లీలో 'సెజ్ పాలసీలపై అంతర్జాతీయ దృక్పథం' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ మరియు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సెజ్ మరియు ఇండస్ట్రియల్ పార్క్స్ (ఎన్‌సిఎస్ఐపి) ఛైర్మన్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పాల్గొని, 'సెజ్‌ల దృక్పథం, మౌలిక సదుపాయాల వృద్ధి' అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో తన అద్భుతమైన విశ్లేషణలను తెలియచేశారు. శ్రీసిటీ అభివృద్ధి గురించి ఆయన చెప్తూ, ఒకప్పటి 'వెనుకబడిన' ప్రాంతం నేడు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక కేంద్రంగా ఎలా రూపాంతరం చెందిందో వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా 29 దేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తూ, 220 పరిశ్రమలకు నిలయంగా, భారతదేశంలో ప్రముఖ తయారీ గమ్యస్థానంగా శ్రీసిటీ పాత్రను వివరించారు. చిత్తశుద్ధితో కూడిన స్మార్ట్ ప్లానింగ్ ద్వారా వెనుకబడిన ప్రాంతాన్ని సైతం ఆర్థికశక్తిగా మార్చగలమనేందుకు శ్రీసిటీ ఒక చక్కటి ఉదాహరణ అని తెలిపారు.






# నయనానందకరం..రంగనాథుని రథోత్సవం



నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామికి జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా, ఈనెల 27 బుధవారం నాడు అంగరంగవైభవంగా జరిగిన స్వామివారి రథోత్సవానికి భక్తజనం వేలాదిగా తరలిరావడంతో రంగనాయకులపేట క్రిక్కిరిసిపోయింది. తొలుత స్వామి వారికి పూజలు చేసి, పల్లకిలో ఊరేగింపుగా చిత్రకూటం వరకు తీసుకువచ్చి రథంలో వేంచేపు చేశారు. తూర్పువీధి నుంచి ఆలయం వరకు, ఆ తర్వాత నాలుగు కాళ్ళ మండపం వరకు రథోత్సవం నయనానందకరంగా సాగింది. భక్తులు జయజయ ధ్వానాలు చేస్తూ, జై రంగా! శ్రీ రంగా! అంటూ రథాన్ని లాగారు. ఈ సందర్భంగా నాలుగుకాళ్ళ మండపం వద్ద ఎదురుకోలు ఉత్సవం వేడుకగా జరిగింది. వేదగిరి నుంచి నరసింహస్వామి ఎదురేగి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించే దృశ్యం భక్తులకు కనువిందు చేసింది. అనంతరం, రాత్రి పొన్నవాహన సేవ నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ వెంకటేశ్వర్లు, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ జి.శ్రీనివాసులు పర్యవేక్షించారు.

# ఆచార్యదేవోభవ..




నవనాగరిక సమాజంలో అవతరించిన అనితరసాధ్యులు
జాతి జీవన వికాసం కోసం పరితపించిన కృషీవలులు
యువతరాన్ని సన్మార్గంలో నడిపించిన మార్గదర్శకులు
సమాజమనే దేవాలయంలో అక్షరాలనే జపించిన పురోహితులు
మా గురువర్యులు, సేవాతత్పరులు

## రత్నం మాస్టారు

వారి పవిత్ర ఆత్మకి శ్రద్ధాంజలి ఘటిస్తూ...
అశ్రునయనాలతో...

**డా. కేశవ్ రామిరెడ్డి**, ఎం.డి.
ఎఫ్.ఎ.సి.సి., ఎఫ్.ఎస్.సి.ఎ.ఐ.
**డా. అనుపమ**
Tampa, Florida, USA

# ప్రజాసేవలో ప్రభాకరరెడ్డి... పతి బాటలో ప్రశాంతిరెడ్డి



## అపర దానకర్ణుడు

### మనసున్న నేతగా మన్ననలందుకుంటున్న

## సేవాభూషణుడు

మనిషి నిదానం.
నిరంతర సేవే ఆయనకి వ్యసనం
అడిగినవారికి లేదనకుండా సాయం చేయడం ఆయన విధానం.
ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే ఆయనకు ప్రధానం.
పేద బడుగు బలహీనవర్గాలంటే ఆయనకు అభిమానం.
ఆయన చేస్తున్న సేవలు, అందిస్తున్న దానధర్మాలు అసమానం.
ఆయన ప్రతి అడుగూ ఓ సంచలనం.
ఆదర్శవంతం ఆయన ప్రస్థానం.
ప్రజల హృదయాలలో చెరిగిపోనిది ఆయన స్థానం.

**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈ పేరు తెలియని సేవాసంస్థలు బహుశా నెల్లూరు జిల్లాలో బహు అరుదుగా వుంటాయి. వ్యాపారం ఆయన వ్యాపకం - సేవ ఆయనకి వ్యసనం. దానానికి పెద్దపీట వేసే నెల్లూరుజిల్లాలో పాతతరం దానధీరుళ్ళందరినీ ఎప్పుడో అధిగమించిన దానధీశాలి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి.**

వేమిరెడ్డి శివాకోటారెడ్డి శ్యామలమ్మ పుణ్యదంపతులకు 1956లో ఆఖరు సంతానంగా ప్రభాకర్‌రెడ్డి జన్మించారు. తామో మగబిడ్డకు జన్మనిచ్చామనుకున్నారే కానీ, ఆనాడు తమ ఇంట్లో ఓ యుగపురుషుడు జన్మించాడని వాళ్ళు భావించి వుండరు. తమ బిడ్డ భవిష్యత్తు బాగుండాలనే సంకల్పంతో జిడ్డు కృష్ణమూర్తి ఫౌండేషన్‌లో నిర్వహించబడే రిషివ్యాలి స్కూల్‌లో తమ అబ్బాయిని చేర్పించి వుంటారేమో గాని, ఆ చిన్న కుర్రవాడు నెల్లూరుజిల్లాలో 'సేవ'కు చిరునామాగా మారతాడని బహుశా వాళ్ళు వూహించి వుండకపోవచ్చు.

మదనపల్లెలోని రిషివ్యాలీ పబ్లిక్‌స్కూల్‌లో యల్‌కెజి నుండి 12వ తరగతి వరకూ చదివి, అక్కడే తన చిన్నతనంలో సమయ పాలన, నైతిక విలువలతో పాటు సమాజం పట్ల మనిషికున్న బాధ్యతలను కూడా తెలుసుకున్నారు ప్రభాకర్‌రెడ్డి. అక్కడనుండి నేరుగా చెన్నై మహానగరంలోని లయోలా కళాశాలలో చేరి బి.ఏ ఎకనామిక్స్ డిగ్రీని అందుకున్నారు. అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో ఓనమాలు నేర్చుకున్న ఆయన ఒక్కసారిగా నిత్యం రద్దీగావుండే నగరంలో క్షణం తీరికలేకుండా గడిపే మనుషుల మధ్యకు వచ్చేశారు. అయినా ఆయన ఆలోచనా సరళి మారలేదు. చిన్ననాడే తనలో బలంగా నాటుకుపోయిన సేవాభావాలు ఎక్కడా వీడలేదు. ఎప్పుడూ ప్రశాంతంగా వుంటూ మంచినే ఆలోచించే మనస్తత్వాన్ని ఆయన సొంతం చేసుకున్నారు.

డిగ్రీ అందుకున్న అనంతరం తండ్రికి చేదోడు వాదోడుగా మైకా మైనింగ్ వ్యాపారంలో భాగస్వామ్యులయ్యారు, అనంతరం కొద్దిరోజులకే కాంట్రాక్టు రంగంలో అడుగుపెట్టి అతిస్వల్పకాలంలోనే తన లక్ష్మీ కన్‌స్ట్రక్షన్ కంపెనీని అగ్రగామి సంస్థగా తీర్చిదిద్ది, దాదాపు 2000 మందికి ఉపాధి కల్పించే స్థాయికి తెచ్చారు. అనంతరం తాను స్వంతంగా ప్రారంభించిన మరో సంస్థ విపిఆర్ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీని కోల్ మైనింగ్‌లో భారతదేశంలోనే ప్రతిష్టాత్మక కంపెనీగా నిలబెట్టారు. ఇక్కడ నుండి ఆయన విజయ ప్రస్థానంతో పాటు సేవా ప్రయాణం కూడా అలుపులేకుండా కొనసాగుతోంది.

కాదు-లేదు అన్న పదం ఆయన డిక్షనరీలో లేదు. నిజమైన అవసరానికి ఆయన ఎప్పుడూ ఆసరాగా వుంటాడనటానికి వేల ఉదాహరణలున్నాయి. "సేవకు కానిదేది అనర్హం" అన్నట్లుగా, విద్యారంగం, వైద్య రంగం, సాహిత్య రంగం, సాంస్కృతిక రంగం, క్రీడారంగం, ఆధ్యాత్మికరంగంతో పాటు అనేక సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు ఆయన కోట్ల రూపాయలను దానం చేశారు. అన్ని విభాగాలలోనూ ఆయన సేవై గుభాళించారు.

వ్యాపార రంగంలో సైతం సంచలనాలకు సారధి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన "వోల్వో" సంస్థ ప్రతిష్టాత్మకంగా రూపొందించే తమ క్యాలెండర్‌లో 2008 సంవత్సరంలో వేమిరెడ్డికి అగ్ర సింహాసనం వేసింది.

మరో అంతర్జాతీయసంస్థ "కొమాట్సో" సంస్థ ఏషియన్ పసిఫిక్‌లోనే అతిపెద్ద ఖాతాదారుడిగా వేమిరెడ్డిని కీర్తిస్తోంది. తమ సంస్థను భారత దేశానికి పరిచయం చేసి తమ ఉనికిని ఈదేశంలో చాటిచెప్పిన ఉత్తమ వ్యాపారవేత్తగా ప్రభాకరరెడ్డికి అత్యుత్తమ స్థానాన్ని కల్పించింది.

2006లో జేసీస్ నుండి ఉత్తమ విశిష్ట వ్యాపారవేత్తగా పురస్కారాన్ని అందుకున్నారు వేమిరెడ్డి. నెల్లూరుజిల్లాకే తలమానికంగా వివిధ పదవులను అలంకరించిన మేధావి. పలుమార్లు కేంద్రమంత్రిగా, ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా నెల్లూరు కీర్తిప్రతిష్టలను పెంచిన డా.బెజవాడ గోపాలరెడ్డిగారి పేర ఏర్పాటుచేసిన "గోపాలరెడ్డి అవార్డు" 2009లో ప్రభాకర్‌రెడ్డిని వరించింది. ఈ సభలో ప్రసంగించిన ముప్పవరపు వెంకయ్యనాయుడు, వేమిరెడ్డిని గురించి మాట్లాడుతూ 'నెల్లూరు జిల్లాలో పుట్టిన ఆణిముత్యంగా ప్రభాకరరెడ్డి'ని కీర్తించారు.

తెలుగువారన్నా, తెలుగు భాషన్నా ప్రభాకరరెడ్డికి మక్కువ ఎక్కువ, ప్రపంచ తెలుగు సమాఖ్య వేదికగా ఎన్నో కార్యక్రమాలకు ఆయన చేయూతనిచ్చారు. మలేషియాలో జరిగిన సమాఖ్య వార్షిక సదస్సుకు తనవంతు సాయంగా భూరి విరాళం అందించి తెలుగుపై వున్న ప్రేమను చాటుకున్న ఘనత ఆయనది.

ఓ వైపు భారతదేశంతో పాటు ఆఫ్రికా దేశంలోనూ, ఇండోనేషియాలోను వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తూ మరోవైపు తన స్వంతగడ్డ నెల్లూరులో నిరంతరాయంగా ఏదో ఒక సేవా కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేయడం అలవాటుగా మార్చుకున్నారు ప్రభాకర్‌రెడ్డి.

### రాజకీయాలు వేదికగా విస్తృత సేవలు!

తన సేవా సరళిని, సేవా పరిధిని మరింత విస్తరించాలనే సంకల్పంతో ఆయన రాజకీయాలను వేదికగా చేసుకున్నారు. ప్రస్తుత అధికార పార్టీ వైసీపీ అధికారంలో లేని నాడు ప్రభాకరరెడ్డి ఆ పార్టీకి అండగా నిలిచారు. రాజ్యసభకి పోటీ చేయడానికి 2018 లో ఎవరూ సాహసించలేకపోతున్న తరుణంలో వైసీపీకి ఆశాకిరణంలా ప్రభాకరరెడ్డి ముందుకొచ్చారు. మొండి ధైర్యంతో బరిలో దిగి అనూహ్యంగా పోటీ లేకుండా విజయం సాధించేవారు. ప్రభాకరరెడ్డి తప్ప వేరే ఎవరైనా ఆనాడు రాజ్యసభ టీడీపీ కైవసం చేసుకుని ఉండేదని అప్పట్లో రాజకీయ వర్గాలలో చర్చ జరిగింది. ఆ తరువాత జరిగిన అన్ని ఎన్నికలలో వీపీఆర్ ఆ పార్టీకి కొండంత అండగా నిలిచారు. కానీ, వైసీపీ వేమిరెడ్డి సమర్ధతని, నిబద్ధతని గుర్తించలేదు. వేమిరెడ్డి ముక్కుసూటి మనస్తత్వం ఆ పార్టీలోని కొంతమంది పెద్దలకి నచ్చలేదు. వేమిరెడ్డికి పొగపెట్టారు. ఆయనని అవమానాలకి గురిచేశారు. ఏరు దాటి తెప్ప తగలేసే చందంగా ప్రభాకరరెడ్డిని వాడుకుని వదిలేశారు. ఆయన సహనాన్ని పరీక్షించారు. నీతి, నిజాయితీలకి ప్రాధాన్యత ఇచ్చి ఆడిన మాటకి కట్టుబడి వుండే ప్రభాకరరెడ్డి అహం దెబ్బతినింది. ఇక ఆ పార్టీలో తాను ఇమడలేనని నిర్ణయించుకున్నారు. అధికార పార్టీకి రాజీనామా ఇచ్చి తెలుగుదేశంలో చేరారు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా బరిలో దిగారు. నిబద్ధతకు, నిస్వార్థానికి నిలువుటద్దం ప్రభాకరరెడ్డి. ప్రజల ఆశీస్సులకోసం తొలిసారిగా ప్రజాక్షేత్రంలోకి వచ్చారు. ముప్పై సంవత్సరాలుగా ఇవ్వడమే తప్ప అడగడం ఎరుగని వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి తొలిసారిగా తనకి ఓటివ్వమని అడుగుతున్నారు. నిజాయతీకి నిరంకుశత్వానికి మధ్య జరిగే పోటీగా ఈ ఎన్నికలని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా, నిస్వార్థసేవే తన విధిగా... పోటీ చేస్తున్న తనని దీవించమంటూ ప్రజల ముంగిళ్లలోకి వస్తున్నారు!



వేమిరెడ్డి దంపతుల
## సేవా పరిమళాలు
వచ్చే వారం...



### ఓటమి నుండే..

## గెలవడం నేర్చుకుంది!

### స్ఫూర్తిదాయకం.. ప్రశాంతిరెడ్డి జీవితం

*ఆమె పేరు ప్రశాంతి. కానీ జీవిత ప్రస్థానంలో ఆమెకు అనేకసార్లు ఎదురైంది అశాంతే. ఆశ నిరాశల మధ్యే జీవిత ప్రయాణం. అయినా సరే అంతులేని ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తూ.. ఓటమిలోనే గెలుపును వెతుక్కుంటూ, ఆ గెలుపుతో జీవితాన్ని మలుపు తిప్పుకుంటూ ముందుకు సాగింది. నిరంతర కృషితో అనేక విజయాలను సొంతం చేసుకుంది.*

*శివానీస్ బొటిక్ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా, విపిఆర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీగా, విపిఆర్ సంస్థల డైరెక్టర్‌గా ఎన్నో బృహత్తర కార్యక్రమాలను నిర్వర్తిస్తూ.. ప్రత్యేకించి ఆధ్యాత్మికసేవలో తరిస్తూ... అందరి ప్రశంసలు అందుకుంటోంది. మారుమూల పల్లె నుంచి వచ్చిన ప్రశాంతి.. జీవితంలో ఎన్ని కష్టనష్టాలెదురైనా.. అత్యంత సహనంతో అధిగమించి.. తన జీవితాన్ని తానే ఒక కొలిక్కి తెచ్చుకుని.. అటు ఆధ్యాత్మిక రంగానికి, ఇటు సామాజిక సేవారంగానికి ఎనలేని సేవలు అందిస్తోంది. అందుకే ఆమె జీవితం.. అందరికీ మార్గదర్శకమైంది.. మహిళా లోకానికే ఆదర్శప్రాయమైంది.*

చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తి ప్రాంతంలోని ఓ మారుమూల పల్లెటూరు.. పునబాక. ఆ ఊళ్ళో మల్లెమాల రాధాకృష్ణారెడ్డి - రమణమ్మ అనే దంపతుల ముద్దుల కూతురు ప్రశాంతిరెడ్డి. తమ కుమార్తెను డాక్టర్ని చేయాలని ఆ తండ్రి ఆశ. అందుకోసం ఆయన 1970 ప్రాంతంలో తమ కుటుంబంతో సహా తిరుపతికి వెళ్ళిపోయి స్థిరపడ్డారు. ప్రశాంతి చాలా చురుకైన అమ్మాయి. ప్రశాంతి ఎస్వీయు క్యాంపస్ స్కూల్‌లో చేరి, ఆ తర్వాత పద్మావతి కాలేజీలో ఇంటర్ చదివింది. స్కూల్లో చేరిన రోజు నుండి ఆమె అన్నిట్లోనూ ఫస్టే. నాన్న కోరిక ఆమెని డాక్టర్‌గా చూడాలని, కానీ ఆమెకి మాత్రం బి.ఏ పాలిటిక్స్ చేయాలన్నది లక్ష్యం. ఆ ఆలోచనతోనే ఎంతో కష్టపడి చదువుకునేది. చదువులోనే కాక ఆటల్లోనూ బాగా రాణించేది. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు కూడా ఉండి అత్యుత్తమ విద్యార్థినిగా.. అన్నిట్లోనూ ఆమే నెంబర్-1గా ఉండేది.

### ఆమె మాటలు.. గెలుపు బాటలు

కాలేజీ విద్యార్థి యూనియన్ సహకార్యదర్శిగా ఆమె ఓసారి పోటీ చేసింది. తాను ఓడిపోయానని ఎవరో చెప్పడంతో ఆమె కృంగిపోయింది. అంతలోనే కాలేజీ ప్రిన్సిపాల్ కమలామీనన్ రూపంలో అదృష్టం ఆమె గది తలుపు తట్టింది. "ఎందుకు ఏడుస్తున్నావు. ఈ ఎన్నికే నీ జీవితమా?. గెలుపు ఓటములు సహజం. ఓడిపోయినంత మాత్రాన కుంగిపోవాల్సిన అవసరం లేదు. అయినా, నువ్వు ఓడిపోలేదు.. గెలిచావు'.. అంటూ తీపి కబురు చెప్పిందామె. ఆ తర్వాత కూడా ప్రశాంతి జీవితంలో ఈ మాటలే పలుసార్లు ఓదార్పునిచ్చి ముందుకు నడిపించాయి. 'ఓడినా గెలిచినా ఎప్పుడూ నిరుత్సాహపడకు. జీవితంలో ఏడుస్తూ.. నీపై నీకున్న నమ్మకాన్ని కోల్పోకు".. అంటూ ఆరోజు తమ ప్రిన్సిపాల్ చెప్పిన వాక్యం ఆమె మనసులో నాటుకుపోయింది. ఆ మాటలే ఆమె పలు సందర్భాల్లో గుర్తుచేసుకోవాల్సి వచ్చింది. ఆ మాటలతోనే ఆమె జీవితంలో పలుసార్లు ఓడి.. గెలిచింది. ఓటమి నుండే గెలుపును సాధించుకుంది.

### జీవితంలో.. ఊహించని మలుపు

ప్రశాంతి ఇంటర్ రెండవ సంవత్సరం చదువుకుంటున్న రోజుల్లో ఆమెలోని చురుకుదనాన్ని, అమాయకత్వాన్ని చూసి ఆమెను ఇష్టపడిన ఓ కుర్రాడు.. నేరుగా ఆమె తల్లిదండ్రుల వద్దకే వెళ్ళి.. మీరు ఒప్పుకుంటే ప్రశాంతిని పెళ్ళి చేసుకుంటానన్నాడు. తన కుమార్తెను డాక్టర్ని చేయాలనుకున్న ఆ తండ్రి ఆలోచనలో పడ్డాడు. ఆ కుర్రవాడి వివరాలు సేకరించాడు. నెల్లూరుజిల్లాలో ఓ రాజకీయ కుటుంబానికి చెందిన అబ్బాయి. ఆ కుటుంబానికి మంచి పేరుంది. తన కూతురి భవిష్యత్తు బాగుంటుంది.. అనుకున్నాడు. వారి పెళ్ళికి అంగీకరించాడు. ఇక్కడి నుంచి ప్రశాంతి జీవితం అనూహ్యమైన మలుపు తిరిగింది. మల్లెమాల ప్రశాంతి... సోమిరెడ్డి ప్రశాంతిగా మారింది. సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి, హైమవతమ్మ (నల్లపరెడ్డి శీనయ్య చెల్లెలు) చిన్నకోడలుగా, సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఇల్లాలుగా నెల్లూరుజిల్లా అల్లీపురంలో అడుగుపెట్టింది.

### అతిపెద్ద విషాదం...

ప్రశాంతికి ఇద్దరు పిల్లలు. ఒక అమ్మాయి, ఓ అబ్బాయి. తన కూతురుకు పెళ్లై తాను కూడా అమ్మమ్మయ్యింది. తనని డాక్టర్‌గా చూడాలనుకున్న తన తండ్రి ఆశయాన్ని తన కుమారుడు అర్జున్ తీర్చబోతున్నాడు అని ప్రశాంతిరెడ్డి భావిస్తున్న తరుణంలో 2004, ఏప్రిల్ 15న ఆమె జీవితంలో అతిపెద్ద విషాదం చోటు చేసుకుంది. విధివశాత్తు ఆమె భర్త హర్షవర్ధన్‌రెడ్డి ఈ లోకాన్ని విడిచి శాశ్వతంగా వెళ్లిపోయాడు.

అనుకోకుండా జరిగిన ఈ విషాద సంఘటన నుండి బయటకొచ్చి, తనను తాను నిలబెట్టుకుని తన బిడ్డలకు తానే తండ్రిగా, తల్లిగా వుండాలనే ఆశయం తప్ప ఆమెకు ఇంకేం కనిపించలేదు. భర్త అస్తికల నిమజ్జన నిమిత్తం ఆమె బెనారస్(వారణాసి) వెళ్లింది. అక్కడే ఆమెకు భగవంతుడు దారి చూపించాడు. వస్త్ర వ్యాపారం చేస్తే ఎలా వుంటుందన్న ఆలోచన ఆమెకు కలిగింది. అంతే... అనుకున్నదే తడవుగా అక్కడే షాపింగ్ చేసింది, తనకున్న స్నేహితురాళ్ళు, ఆప్తులు, ఆత్మీయుల ప్రోద్బలంతో తన మనుమరాలి పేరుతో 'శివానీస్ బొటిక్'ను ప్రారంభించింది. ఆ వ్యాపారమే నడిసంద్రంలో చుక్కానిలా ఆమెను ఆదుకుంది. ఇలా ప్రతిసారీ ఆమె ఓటమి నుండే గెలుపుకి దగ్గరౌతూ వచ్చింది. విధి తనతో వింత నాటకాలు ఆడినా ఆమె ఎక్కడా తొణకలేదు, బెణకలేదు, అధైర్యపడలేదు.

### శ్రీ వేంకటేశ్వరుని ఆశీస్సులు...

ఆమెకు బాగా వూహ తెలిసినప్పటి నుండి ఆమె షిరిడి సాయిబాబా భక్తురాలు. కానీ, ఆమెకు తెలియకుండానే ఆమె చిన్నతనం నుండీ శ్రీ వేంకటేశ్వరుని ఆరాధకురాలు. ఆమె బాల్యంలో, తన తల్లిదండ్రులు ప్రతి శనివారం తిరుమలకు వెళ్ళేవాళ్ళు. ఈమె కూడా వారి చేయి పట్టుకుని తిరుమల వెళ్లేది. స్వామివారిని నిష్కల్మషంగా సేవించేది, తన కన్నవారితో పాటు తానూ నమో వేంకటేశాయా అనుకుంటూ స్వామిని కీర్తించేది.

తాననుకున్న మెట్టు ఒక్కొక్కటీ ఎక్కుతూ తన బిడ్డల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తూ భారాన్నంతా భగవంతుడిపై పెట్టి జీవనం సాగిస్తున్న తరుణంలో ఆమెకు ఎదురైన ప్రత్యక్షదైవం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. అనుకోకుండా ఓ వేడుకలో వీరిద్దరికీ పరిచయం కావడం, ఆమె ఆశయాలు, భావాలు, ఆలోచనలు ఆయనకు నచ్చడంతో వీరిద్దరూ దైవసన్నిధిలో ఒక్కటయ్యారు. నిష్కల్మష హృదయంతో, నిస్వార్థ భావంతో తన కుటుంబమే తన ప్రాణంగా భావించి ప్రశాంతిరెడ్డి చేస్తుండిన జీవన పోరాటం ప్రభాకర్ రెడ్డిని ఆకర్షించింది. తనకి అసలు పెళ్లే వద్దనుకున్న ఆయన ప్రశాంతిరెడ్డిని తన సహధర్మచారిణిగా స్వీకరించారు.

### ఆమెకిది పునర్జన్మ...

చిన్న వయస్సులోనే పెళ్లయ్యింది. ఆ తరువాత అనుకోకుండా భర్త దూరమయ్యాడు. పిల్లలు ఇంకా స్థిరపడలేదు. తాను చేస్తున్న జీవనపోరాటంలో తుది మజిలీ ఏమిటో ఆమెకు తెలియదు. ఇలాంటి తరుణంలోనే ఆమె మళ్ళీ వెనుతిరిగి చూడాల్సిన అవసరమే లేని అదృష్టాన్ని ఆమెకు భగవంతుడు కల్పించాడు. మనసున్న మనిషిగా, మానవతా వాదిగా, నైతిక విలువలున్న వ్యక్తిగా సమాజం కీర్తిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆమెకు పతిగా అందించాడు. ఆమె కష్టాలన్నీ ఇప్పుడు గట్టెక్కాయి. సమాజసేవతో పాటు, ఆధ్యాత్మిక చింతనతో ఆమె ఆనందజీవితాన్ని ఆస్వాదిస్తోంది.

విపిఆర్ ఫౌండేషన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా కొన్ని కోట్ల రూపాయలతో పేదవారి కోసం వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందిస్తున్న విద్య, వైద్యం, మంచినీరు వంటి మహత్కార్యాలలో సంస్థ ట్రస్టీగా పాలుపంచుకునే అవకాశం తనకు రావడం అంటే జీవితంలో అంతకంటే ఆనందం మరొకటి ఏముంటుందని అంటుందామె. నెల్లూరులో జరిగిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి వైభవోత్సవాలలోనూ, కాణిపాకం వినాయకుడికి జరిగిన కుంభాభిషేకంలోనూ, సూళ్లూరుపేట చెంగాళమ్మకి 9రోజుల పాటు జరిగిన కుంకుమార్చన... ఆ తరువాత జరిగిన కుంభాభిషేకంలోనూ, జొన్నవాడ కామాక్షమ్మకు 5రోజుల పాటు జరిగిన కుంకుమార్చనలోనూ, షిరిడి సాయిబాబా పాదుకలను నెల్లూరుకు తీసుకొచ్చి భక్తుల దర్శనార్థం విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడురోజుల పాటు వుంచినప్పుడూ, ప్రభాకర్‌రెడ్డితో కలసి ఆయన శ్రీమతిగా సంకల్పం చెప్పుకునే భాగ్యం భగవంతుడు తనకి కల్పించడం తన పూర్వీకులు చేసిన పుణ్యఫలమే అంటారామె.

### వ్యాపార వ్యవహారాలు

విపిఆర్ ఫౌండేషన్ చేపట్టే సమాజసేవా కార్యక్రమాలను ఓవైపు పర్యవేక్షిస్తూ, సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సారథ్యం వహిస్తూ, దాదాపు 150 మందికి జీవనోపాధి కల్పిస్తున్న తన "శివానీస్" బొటిక్ ఓవైపు, విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నిర్వహణ బాధ్యతలు ఓ వైపు, విపిఆర్ విల్లాల పురోగతి పర్యవేక్షణ మరోవైపు చూసుకుంటూ అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న మీ సామర్థ్య రహస్యం ఏమిటి అని ప్రశ్నించినప్పుడు... ప్రతి విషయంలోనూ తనకు స్వతంత్రతను ఇచ్చి ప్రోత్సహిస్తున్న తన భర్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డే అని చెప్పారామె. ఆయనందిస్తున్న సహకారం, కల్పిస్తున్న స్ఫూర్తి భవిష్యత్‌లో ఇంకా మంచి కార్యక్రమాలు చేయాలన్న ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని తనలో కలిగిస్తున్నాయని అన్నారామె.

### రాజకీయ రంగ ప్రవేశం!

విపిఆర్ ఫౌండేషన్ అందించే సేవల ద్వారా ఎక్కువ స్థాయిలో ప్రజలకు సేవ చేయాలన్నది తన లక్ష్యంగా చెప్తుంటారు ప్రశాంతిరెడ్డి. తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పరిపక్వత కలిగిన పరిపూర్ణ మహిళగా సమాజంలో గుర్తింపును సాధించింది ప్రశాంతిరెడ్డి. ఓటమిలో గెలుపును వెతుక్కుంటూ గెలుపుతో తన జీవితాన్ని మలుపు తిప్పుకుంటూ అగ్రస్థానంలో నిలచారామె! కష్టాలను దాటుకుంటూ సుఖాలను చేరుకుంటూ, మంచి, మానవత్వం, నైతికతలే మనోబలంగా ముందుకు సాగుతూ తన జీవితాన్ని విజయ ప్రస్థానం వైపు నడిపించుకుని ఆనందమయం చేసుకుంటున్న శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి ప్రభాకర్‌రెడ్డి ఇప్పుడు రాజకీయ రంగ ప్రవేశం చేశారు. సమాజానికి తన సేవలు అవసరం అని భావించినప్పుడు అవసరమైతే తప్పకుండా రాజకీయారంగేట్రం చేస్తా అని ఆమె పలు సందర్భాలలో చెప్పేవారు. అనూహ్య పరిణామాలతో ఆమె తెలుగుదేశం పార్టీ కోవూరు నియోజక వర్గ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ప్రజల ఆశీస్సులతో విజయప్రస్థానం వైపు అడుగులు వేసే దిశగా నడుస్తున్నారు...!!!



# గాంధేయవాది

# కేవీ చలమయ్య.. అస్తమయం



***నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యం ఆయన. సామాజిక సేవాపరాయణత్వం ఆయన తత్వం. వ్యాపార, సామాజికవర్గాల పెన్నిధిగా, స్వాతంత్ర్యసమరయోధునిగా ప్రజలు, ప్రభుత్వం గౌరవించి సత్కరించిన గాంధేయవాదిగా వినుతికెక్కిన ఆర్యవైశ్య ప్రముఖుడు, తొంభై ఏళ్ళ కురువృద్ధుడు పరిపూర్ణ జీవితం గడిపి తరలివెళ్ళిపోయారు. మార్చి 23వ తేదీ ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త అందరినీ కలచివేసింది. అందరిచేత ఆప్యాయంగా కె.వి.చలమయ్యగా పిలిపించుకొనే కోన వెంకట చలమయ్య ఇక లేరు.***

ప్రముఖ స్వాతంత్ర్యయోధులు..ఆంధ్రరాష్ట్రం కోసం అసువులే అర్పించిన మహామనిషి శ్రీ పొట్టి శ్రీరాములుతో చలమయ్యకు సాన్నిహిత్యం ఉండడం విశేషం. నెల్లూరులో శ్రీ పొట్టి శ్రీరాములు చేపట్టిన తొలిదశ ఉద్యమాల నేపథ్యంలో చలమయ్య పాత్ర కూడా ఉంది. గాంధీజీ పిలుపుమేరకు సబర్మతీ ఆశ్రమం నుంచి నెల్లూరుకు వచ్చిన పొట్టి శ్రీరాములుకు వసతి కల్పించింది కె.వి.చలమయ్య మామ దేవతా చెంచురామయ్య కావడంతో, చలమయ్యకు శ్రీరాములుతో సాన్నిహిత్యం ఏర్పడింది. పొట్టి శ్రీరాములు నెల్లూరులో దళితుల దేవాలయ ప్రవేశాన్ని వేణుగోపాల స్వామి ఆలయంలో జరిపినపుడు, అందులో చలమయ్య కూడా పాల్గొని పొట్టి శ్రీరాములు సహచరునిగా పేరొందారు. అందుకే, చలమయ్య మీద పొట్టి శ్రీరాములు ప్రభావం ఎక్కువగా కన్పిస్తుంది. ఆయన భావపరంపరల్ని జీర్ణం చేసుకొన్న వ్యక్తిగా చలమయ్య శ్రీరాములు పట్ల ఎంతో అభిమానం ప్రదర్శించేవారు. ఆ తర్వాత కాలంలో కూడా శ్రీ పొట్టి శ్రీరాములు పేరుతో జిల్లాలో ఏ కార్యక్రమం జరిగినా చలమయ్య ముందుండేవారు.

నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు పేర నామకరణం చేయాలని, ఆయన కార్యస్థలిని గుర్తించేలా శాశ్వతత్వం కల్పించాలని ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, బంద్‌లు, హర్తాళ్‌లు జరిగాయి. సభలు, సమావేశాలు సైతం ఉధృతంగానే సాగాయి. ఆనాటి అన్ని కార్యక్రమాల్లో చలమయ్య కీలకవ్యక్తిగా వ్యవహరించారు. పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలని, ఆయన విగ్రహం పార్లమెంటు భవనంలో ఏర్పాటు చేయాలని నిరంతరం కేంద్రమంత్రులకు, కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాల శరపరంపరలతో తన ప్రయత్నాలను సాగించిన పట్టువదలని విక్రమార్కుడు చలమయ్య.నెల్లూరు జిల్లా పేరును పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా ప్రకటించిన దివంగత మహానేత, నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డిని ప్రభావితం చేసిన కొణిజేటి రోశయ్య వెనుక ఆయన ఆత్మబంధువు చలమయ్య విజ్ఞాపన కూడా ప్రాముఖ్యత సంతరించుకుందని చెప్పొచ్చు.

## రోశయ్యతో స్నేహానుబంధం

మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు కొణిజేటి రోశయ్యతో కూడా చలమయ్యకు ఎంతో ఆత్మీయానుబంధం, వాత్సల్యం ఉండేవి. రోశయ్య ఏ హోదాలో నెల్లూరొచ్చినా మిత్రుడైన చలమయ్య ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించేవారు. ఆర్థికమంత్రిగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నరుగా కూడా తమ ఇంటికి వచ్చిన రోశయ్యనుద్దేశించి 'కుచేలుడింటికి శ్రీకృష్ణుడు వచ్చాడు' అంటూ ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిపోయేవారాయన. అందుకు రోశయ్య 'కుచేలుడూ లేదు, శ్రీకృష్ణుడూ లేదు.. నేను స్నేహితుడిగా మీ ఇంటికి వస్తున్నానంతే' అని తనదైన శైలితో నవ్వుతూ బదులిచ్చేవారు. వారిద్దరి మధ్య అంతటి ప్రగాఢ స్నేహానుబంధం ఉండేది. రోశయ్య తమ ఇంటికి వచ్చినప్పుడల్లా నెల్లూరులోని ప్రముఖ కవి చిన్ని నారాయణరావు చేత ఆత్మీయంగా అభినందన పత్రాలు రాయించి, చదివించి రోశయ్యను ఘనంగా సత్కరించేవారాయన.

గత అయిదేళ్ళుగా చలమయ్యను స్వాతంత్ర్య సమరయోధునిగా, పొట్టి శ్రీరాములు అనుయాయిగా గుర్తించిన నెల్లూరుజిల్లా కలెక్టర్లు స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్‌డే వేడుకలు, పొట్టి శ్రీరాములు వర్ధంతి, జయంతుల సందర్భాల్లో చలమయ్యను సత్కరించారు. అంతేకాదు, ప్రముఖ సినీనటుడు సాయిచంద్ త్యాగధనుడైన శ్రీరాములు పట్ల ఆరాధనతో ఇటీవల చెన్నై నుంచి పొట్టి శ్రీరాములు జన్మించిన ఒకప్పటి పాత నెల్లూరుజిల్లా.. నేటి ప్రకాశంజిల్లాలోని పడమటి పల్లె గ్రామానికి పాదయాత్రలో భాగంగా నెల్లూరు నగరానికి వచ్చినప్పుడు, ఆయనను ఆదరించి ఆశీర్వదించి ఆతిథ్యం ఇచ్చింది కూడా కె.వి. చలమయ్యే.

## రొటేరియన్‌గా సేవలు

రొటేరియన్‌గా నెల్లూరు రోటరీ క్లబ్‌కు కేవీ చలమయ్య అపారమైన సేవలందించారు. రోటరీ స్మశానవాటిక ప్రాజెక్టుకు విరాళాల్ని సైతం అందించిన ఘనత చలమయ్యది. చెన్నై చాంబర్ ఆఫ్ కామర్స్, అంతర్జాతీయ ఆర్యవైశ్య మహాసభ, ఆంధ్రరాష్ట్ర ఆర్యవైశ్య మహాసభల్లో కీలక భూమికల్లో ఉండేవారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్యుల అన్నదాన సత్రాల్లోనూ చలమయ్యను గౌరవించి ప్రముఖస్థానంలో ఆయన పేరు పెట్టేవారు.

చలమయ్యకు భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నెల్లూరు ఆర్యవైశ్యులకు మార్గదర్శనం చేస్తూ, రాష్ట్ర మహాసభల్లో సైతం తనదైన విశిష్ట పాత్ర పోషిస్తూ నిరంతరాయంగా పనిచేసిన ఆదర్శప్రాయుడు చలమయ్య. ఆయన నిష్క్రమణం ఆర్యవైశ్యులకు, నెల్లూరుజిల్లా వాసులకు తీరనిలోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.




జననం : 23.05.1943 నిర్యాణం : 20.03.2024

శ్రద్ధాంజలి

లక్షలాదిమంది భవితకు బంగారుబాటలు వేసిన
అక్షర రూపం
రాష్ట్ర విద్యా రంగంలో దేదీప్యమానంగా ప్రకాశించిన
విజ్ఞాన దీపం
నాకు అత్యంత ఆప్తులు, ఆత్మీయమిత్రులు
శ్రీ కే.వీ.రత్నం
పవిత్ర ఆత్మకి శ్రద్ధాంజలి ఘటిస్తూ...

జే.కే.రెడ్డి
మాజీ శాసనసభ్యులు
నెల్లూరు.


● చిన్ననాటి స్నేహితులు

# విజయ - సాయి కలిశారు



నెల్లూరు పార్లమెంటు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డి తన చిన్ననాటి మిత్రులందరినీ కలుసుకుంటున్నారు. ఎన్నో ఏళ్ళ క్రితం కలిసిన స్నేహితులందరినీ గుర్తుచేసుకుని వాళ్లందరితో తన పాత రోజులు జ్ఞాపకం చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన పొగతోటలోని కేవీఆర్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కలవకూరు కుటుంబ బ్రాండ్ అంబాసిడర్, పొగతోట హీరో విజయ కుమార్‌రెడ్డిని కలుసుకున్నారు. శాసన మండలి సభ్యులు, జిల్లా వైసీపీ అధ్యక్షులు చంద్రశేఖరరెడ్డితో కలసి కేవీఆర్ ఆఫీసుకు వచ్చిన సాయిరెడ్డికి విజయ కొడుకు శ్రావణ్‌కుమార్ స్వాగతం పలికారు. విజయ - సాయి కొంచెంసేపు పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు, సెల్ఫీలు తీసుకున్నారు. రాబోయే ఎన్నికలలో తనకి మద్దతు తెలపాలని విజయకుమార్‌రెడ్డిని సాయిరెడ్డి కోరారు. విజయరెడ్డి ఆఫీసుకి సాయిరెడ్డి రావడంతో కలవకూరు అభిమానులు సంబరపడ్డారు.

# చంద్రబాబు పర్యటన..29న



టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 29న నెల్లూరుజిల్లాకు వస్తున్నారు. ఆరోజున కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో రోడ్‌షో, బహిరంగసభల్లో ఆయన పాల్గొంటారని ఆ పార్టీ వర్గాల సమాచారం. తమ అధినేత రాకకోసం నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కావలిలో ఆ రోజు మధ్యాహ్నం 3గంటల నుంచి 4.30 గంటల వరకు జరిగే సభలో చంద్రబాబు పాల్గొని అక్కడినుంచి వింజమూరుకు వెళ్ళి సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు సభా కార్యక్రమంలో పాల్గొంటారని, ఆ రాత్రికి వింజమూరులోనే బస చేస్తారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# టీటీడీ ఆధ్వర్యంలో కాలేయ మార్పిడి

● తెలుగు రాష్ట్రాలలోనే తొలి ఉచిత శస్త్ర చికిత్స

● ఉచిత సేవకి సముచిత సత్కారం



లివర్(కాలేయం) సోరియాసిస్‌తో బాధపడుతుండిన చిత్తూరుజిల్లాకి చెందిన 53 సంవత్సరాల సుధారాణికి కాలేయ మార్పిడి జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానాల సహకారంతో చెన్నై గ్లెనిగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్‌కి చెందిన ప్రముఖ కాలేయ విభాగ నిపుణులు డాక్టర్. పీ.వీ.రజనీకాంత్ తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఈ కాలేయ మార్పిడి శాస్త్ర చికిత్స నిర్వహించారు. గత జనవరి 19న ఈ మార్పిడి జరిగింది. ప్రస్తుతం సుధారాణి పూర్తిగా కోలుకుని సాధారణ జీవితం గడుపుతున్నారు. ఆమె కాలేయ మార్పిడి ఆపరేషన్‌తో పాటు అవసరమైన మందులు కూడా టీటీడీయే పూర్తిగా ఉచితంగా అందచేయడం విశేషం.

టీటీడీ అభ్యర్ధన మేరకు ఉచితంగా తన సేవలు అందించడానికి ముందుకొచ్చిన డాక్టర్ రజనీకాంత్‌ని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి అభినందించారు. రజనీకాంత్‌కి తిరుమలలో స్వామివారి ఆశీస్సులు అందచేసి శాలువా, మొమెంటో, సర్టిఫికెట్‌తో సత్కరించారు. ధర్మారెడ్డితో పాటు ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశ్రీ విభాగ ప్రధాన అధికారి, ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ ఎం.హరికృష్ణ, స్విమ్స్ డైరెక్టర్ ఆర్.వీ.కుమార్ రజనీకాంత్‌ని అభినందించిన వారిలో ఉన్నారు. కాలేయ మార్పిడి, అనంతరం చికిత్స పూర్తిగా ఉచితంగా అందించడం రెండు తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే బహుశా ఇదే తొలిసారి అని డాక్టర్ రజనీకాంత్ 'లాయర్'కి తెలిపారు. ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహించి మృత్యువుతో పోరాడుతుండిన మహిళకి ప్రాణభిక్ష పెట్టిన డాక్టర్ రజనీకాంత్ మన నెల్లూరు వారు కావడం గర్వకారణం.

# సోమిరెడ్డి సాధించుకున్నాడు!



సర్వేపల్లి టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డినే ఆ పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. ఉమ్మడి నెల్లూరుజిల్లాలో అన్ని స్థానాలకీ అభ్యర్థులని ప్రకటించిన తెలుగుదేశం పార్టీ సర్వేపల్లిని మాత్రం పెండింగులో ఉంచారు. గాలి వార్తలు, గాసిప్పుల కోసం ఆవురావురుమంటూ ఎదురుచూసే సామాజిక మాధ్యమాలు రెచ్చిపోయాయి. ఆదాల కోసం సీటు ఉంచారని కొందరంటే, సోమిరెడ్డిని పక్కన పెట్టారని మరికొందరంటే, చంద్రమోహన్‌రెడ్డి కోడలికి ఇస్తారంట అని ఇంకొందరు అంటే, కాదు కాదు.. యాదవ్‌కిస్తారంట అని చివరికొకరు అంటే.. ఇలా సర్వేపల్లి నియోజకవర్గాన్ని వార్తల్లో పెట్టి నమిలి తినేశారు. సామాజిక మాధ్యమాలు, రాజకీయవర్గాల ఊహాగానాలన్నిటినీ పటాపంచలు చేస్తూ... చిట్టచివరికి ఆ సీటు సోమిరెడ్డినే వరించింది. ఇన్ని అనుమానాలు, అవమానాల మధ్య సీటు దక్కించుకున్న చంద్రమోహన్‌రెడ్డి విజయం ఖాయం అని సర్వేపల్లి నియోజకవర్గ సర్వేరాయుళ్ళు ఘంటా భజాయించి చెప్తున్నారు. చూద్దాం ఏం జరుగుతుందో!




ఓం శాంతి..!



కీ.శే. డా.పి.యల్.రావు
వ్యవస్థాపకులు
మాడరన్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్స్

ఎంతోమంది యువతీ యువకులను
డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, సైంటిస్టులుగా
తీర్చిదిద్ది ప్రపంచ నలుమూలలకి పంపి
నెల్లూరు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన గురువర్యులు

"శీలేన శోభతే విద్యా" అంటూ
లక్షలాది మందిని ఉత్తమ పౌరులుగా మలచిన
అభినవ వ్యాసుడు

**శ్రీ కే.వీ.రత్నం గారి**

ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

**డా॥ హెచ్.భారతి,** ఛైర్‌పర్సన్
**డా॥ జి.విష్ణుతేజ,** మెడికల్ డైరెక్టర్
**డా॥ పి.చిన్మయి,** మెడికల్ డైరెక్టర్

మాడరన్ 'ఐ' హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్
డా॥ పి.ఎల్.రావు స్ట్రీట్, పొగతోట, నెల్లూరు. ఫోన్: 2306015, సెల్: 7386892998

మాడరన్ రెటీనా సెంటర్
16-11-99, హోటల్ వెంకటరమణ వెనుక వీధి, పొగతోట, నెల్లూరు. ఫోన్: 2354455

# ఆనం గ్యాంగ్ మాయమాటలకు మోసపోవద్దు



- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ఆనం గ్యాంగ్ మాయమాటలకు మోసపోవద్దని వెంకటగిరి నియోజకవర్గ వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 24న ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాజీమంత్రి, ఆత్మకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డిపై విమర్శల బాణాలు సంధించారు. వెంకటగిరి నియోజకవర్గంలో ఆనం గ్యాంగ్ అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తూ, వైకాపా వారికి దబ్బులిస్తామని.. తమ వెంట ఉండాలని ఫోన్ల ద్వారా ప్రలోభ పెడుతున్నారని ఆయన ఆరోపించారు. వెంకటగిరి ప్రాంత ప్రజలు, నాయకులు అమాయకులని గ్రహించిన ఆనం, వారిని ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారన్నారు. రామనారాయణరెడ్డి ఆత్మకూరు వెళ్లినా ఆయన ఆత్మ వెంకటగిరిలోనే ఉందన్నారు. గతంలో వెంకటగిరి ప్రాంత ప్రజా ప్రతినిధులను తన పక్కనే కుర్చీల్లో కూర్చోబెట్టుకొని, వారి అభీష్టానికి వ్యతిరేకంగా, వారికే తెలియజేయకుండా, ప్రభుత్వంపై వ్యతిరేకంగా విమర్శలు చేసిన విధంగానే మళ్లీ ఆయన గ్యాంగ్‌తో కుట్రలకు తెర లేపుతున్నారని ఆరోపించారు. అయితే, ఆనం గ్యాంగ్ ఆటంకాలను ప్రజలే తిప్పికొడతారని ఆయన ధీమాగా చెప్పారు.

**సీఎం జగన్‌కు పెరుగుతున్న ప్రజాదరణ :**

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండతోనే తనతో పాటు వెంకటగిరి నియోజకవర్గంలో ఎంతో మందికి ప్రజా ప్రతినిధులుగా, క్రియాశీలక నాయకులుగా అవకాశం వచ్చిందని గుర్తుంచుకోవాలని రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పార్టీ కోసం కష్టపడే తత్వం ఉన్న ప్రతి ఒక్కరికి జగన్మోహన్‌రెడ్డి న్యాయం చేస్తారన్నారు. ఎన్నికల్లో జగన్‌కు అండగా నిలిచి ఆయనకు కృతజ్ఞత చాటాల్సిన సమయంలో ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్సీపీలో ఉన్న నాయకులు ఆనం సలహా పాటిస్తే ఎవరికీ మేలు జరగదని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌కు ప్రజాదరణ పెరిగిందే కానీ కాస్తంత కూడా తగ్గలేదని, నియోజకవర్గంలోని 94 వేల ఇళ్లల్లో 78వేల ఇళ్లకు పైగా తిరిగిన తనకు ఆ విషయం స్పష్టంగా అర్థమైందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడే 151 సీట్లు అందించిన ప్రజానీకం, ఐదేళ్ల ముఖ్యమంత్రిగా అభివృద్ధి సంక్షేమాన్ని గడప గడపకు చేర్చిన సీఎం వైఎస్ జగన్‌కు ఈ దఫా ఎన్నికల్లో అంతకు మించి సీట్లు ఇస్తారని నమ్మకం ఉందని ఆయన స్పష్టం చేశారు.

# పెంచలకోన లక్ష్మీనృసింహునికి.. చంద్రబాబు పూజలు



నెల్లూరుజిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలం పెంచలకోనలో వెలసి వున్న శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయాన్ని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఇటీవల దర్శించుకుని, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కొలువైవున్న శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారిని, శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయన్ను సాదరంగా స్వాగతించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ చరిత్ర విని మనసు పులకించిందని, రాష్ట్రానికి మంచి జరగాలని స్వామివారిని ప్రార్థించానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు వెంట నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పనబాక లక్ష్మి తదితరులున్నారు.

# శ్రీసిటీ వైద్య సదుపాయాలపై.. అవగాహన సదస్సు



ప్రపంచఖ్యాతి పొందిన పారిశ్రామికవాడ.. శ్రీసిటీలోని ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల పట్ల ఇటీవల స్థానిక ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీసిటీలోని రామచంద్ర, మెడికవర్, కేర్ డెంటల్, శంకర్ నేత్రాలయ, తులసి ఆయుర్వేదిక్ ఆసుపత్రుల డాక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ ఆసుపత్రుల్లో అందుబాటులో వున్న వైద్య సదుపాయాల గురించి డాక్టర్లు వివరించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్‌కుమార్ మాట్లాడుతూ, శ్రీసిటీ చేపడుతున్న వివిధ ఆరోగ్య సంరక్షణ చర్యలను వివరించారు. సంస్థ ఆవిర్భావం నుంచి ఈ ప్రాంతంలో వైద్య సేవల అభివృద్ధికి శ్రీసిటీ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పారు. కేర్ డెంటల్ డాక్టర్ మెటిల్డా, రామచంద్ర ఆసుపత్రి డాక్టర్ సులోచన, డాక్టర్ ధీరజ్‌రెడ్డి (మెడికవర్), డాక్టర్ మెహక్లీన్ కౌర్ గిల్ (శంకర్ నేత్రాలయ), డాక్టర్ సాయి ప్రియ (తులసి ఆయుర్వేదిక్)లు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



# ఉమ్మడి అభ్యర్థుల గెలుపుతోనే ప్రగతి



రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటేనే అభివృద్ధి సాధ్యమని తిరుపతి పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు తెలిపారు. గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 25న మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ తిరుపతి ఎంపీగా ప్రసాదరావును, గూడూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ప్రజలను కోరారు. నాయకులు పులిమి శ్రీనివాసులు, వాటంబేటి శివకుమార్ దువ్వూరు రవీంద్రరెడ్డి, పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, బిందురెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, తాళంకి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మను ఇటీవల గూడూరులోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన మండ్ల రాజేష్‌కుమార్.

## పక్కదారిపడుతున్న ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు

- నాగిశెట్టి ధర్మయ్య -



భారత రాజ్యాంగం ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాలు చట్టసభల్లో విధిగా ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయించడమే కాక, ఆ నిధులను దారి మళ్లించకుండా తప్పనిసరిగా పూర్తిగా ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి ఖర్చు చేయాలని ఏపి షెడ్యూల్డ్ కులాల వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నాగిశెట్టి ధర్మయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని పార్టీలు సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించకుండా ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేసేలా తమ మేనిఫెస్టోల్లో ప్రకటించాలన్నారు.

## చిన్నారులకు వస్తు సామాగ్రి



గూడూరు పట్టణంలోని బాలసదనంలో న్యాయవాది చిల్లకూరు సాయికృష్ణారెడ్డి దాతృత్వంతో చిన్నారులు వినియోగించుకొనే వస్తుసామాగ్రిని ఈ నెల 26న అందజేశారు. ఈ సందర్భంగా బాల సదనం అధికారిణి అరుణ దాతలు అందిస్తున్న సేవలను అభినందించారు.

## దివ్యాంగులకు రోటరీ వెస్ట్ సాయం

ఈనెల 27వతేదీ గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో రోటరీవెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. లిటిల్ ఏంజెల్స్ స్కూల్ ఛైర్మెన్ శ్రీకాంత్‌రెడ్డి వారి తల్లి బుస్సారెడ్డి కుంతలమ్మ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించారు. క్లబ్ అధ్యక్షులు సనత్ కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.




# క్షయ వ్యాధి నివారణ పట్ల దృష్టి సారించాలి



**డాక్టర్ కె.గౌరీనాథ్**
**ఎనెల్ స్పెషాలిటీ హాస్పిటల్**
**నెల్లూరు**

క్షయవ్యాధి(టీబీ) అనేది ప్రపంచంలోని ఒక సాధారణ మరియు అతి ముఖ్యమైన అంటు వ్యాధి. ఇది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజల అనారోగ్యానికి, లక్షలాది మంది మరణాలకు కారణమవుతోంది. సాధారణంగా ఈ వ్యాధి ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. చికిత్స లేకుండా ఉంటే 50శాతం కంటే ఎక్కువమంది టీబీ రోగులు 10సంవత్సరాలలో మరణించే ప్రమాదం కూడా ఉంటుంది. భారతదేశంలో 2.8 మిలియన్ల టీబీ కేసులున్నాయని 2023లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. (ప్రపంచంలోని మొత్తం టీబీ కేసులలో ఇది 27శాతం).

### టీబీ ఎలా వ్యాపిస్తుంది?

దగ్గేటప్పుడు గాలిలోకి విడుదలయ్యే కఫం యొక్క చిన్న బిందువులలోని టీబీ క్రిములు లేదా భూమిపై ఎండిపోయిన కఫం యొక్క చిన్న కణాలను ఆరోగ్యకరమైన వ్యక్తి పీల్చినప్పుడు మాత్రమే టీబీ ఇతరులకు వ్యాపిస్తుంది. టీబీకి వ్యతిరేకంగా వారసత్వంగా వచ్చిన రోగనిరోధక శక్తి లేదు. అదృష్టవశాత్తూ, టీబీకి కారణమయ్యే సూక్ష్మక్రిములను పీల్చే వారందరికీ టీబీ వ్యాధి సోకదు. రోగనిరోధక వ్యవస్థ ద్వారా ఊపిరితిత్తులలో ఎక్కువ సంఖ్యలో జెర్మ్స్ చంపబడతాయి. కొన్ని సోకవచ్చు. సోకిన వ్యక్తులలో 5–10శాతం మాత్రమే వారి జీవితకాలంలో టీబీ వ్యాధి వచ్చే ప్రమాదం ఉంటుంది. పోషకాహార లోపం, డయాబెటిస్ మెల్లిటస్, ధూమపానం, రోగనిరోధక శక్తిని అణిచివేసే మందులను ఉపయోగించడం, హెచ్ఐవి ఇన్‌ఫెక్షన్ ఉన్నవారు..టీబీతో అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేసేటప్పుడు నోరు మరియు ముక్కును మాస్క్‌తో కప్పి ఉంచడం ద్వారా టీబీ వ్యాప్తిని నివారించవచ్చు. ఒకసారి సేకరించిన కఫం వంటి టీబీ సోకిన పదార్థాన్ని కాల్చివేయాలి. యాక్టివ్ టీబీ ఉన్న వ్యక్తిని 2 వారాలపాటు లేదా టీబీ నిరోధక మందులను ప్రారంభించిన తర్వాత, ఆ రోగికి అంటువ్యాధి తగ్గేంత వరకు విడిగానే ఉంచాలి. రోగనిర్ధారణకు తగిన చికిత్సలు, చికిత్స వ్యవధిలో మందులను అందించడం ద్వారా, అంకిత భావంతో కృషిచేసి, దేశంలో విస్తరిస్తున్న టీబీని క్రమేణా పూర్తిస్థాయిలో నివారించుకోవాలి.

(మార్చి 24, ప్రపంచ టీబీ - దే సందర్భంగా)

# మా పెద్దాయనకి అశ్రునివాళి..!



విలక్షణమైన వ్యక్తిత్వం
ఎవరినీ నొప్పించని మనస్తత్వం
ఆపదలో ఆదుకునే దాతృత్వం
నేనున్నానంటూ స్పందించే సేవాతత్వం
మా పెద్దాయన తత్వం

విద్యా రంగంలో సంచలనాత్మక విజయాలతో
ఆంధ్ర రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు సాధించి
తమ అమూల్యమైన దీవెనెలు అందించి
మాకు అనునిత్యం కనిపించే దైవంగా
మా అందరినీ వెన్నంటి నడిపించిన

## కే.వీ.రత్నం గారి

పవిత్ర ఆత్మకి శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

అశ్రునయనాలతో...

**యన్.రామమూర్తి నాయుడు**
జనరల్ మేనేజర్
డా॥ కిషోర్స్ రత్నం స్కూల్స్
డా॥ కిషోర్స్ రత్నం జూనియర్ కాలేజీ

# కళ్యాణ వైభవం...!

మేఘన-రిత్విక్



ఎస్‌విఆర్ మార్కెటింగ్ ఏజెన్సీ వ్యవస్థాపకుడు నాదెళ్ళ వెంకటరమణయ్య మనుమరాలు, సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ పంపిణీ దారుడు నాదెళ్ళ వెంకటసురేష్ - శ్రీమతి అరుణల కుమార్తె **దివ్యసాయి మేఘన - లక్ష్మణ్ రిత్విక్** (విజయవాడ వాస్తవ్యులు మానేపల్లి రాజారావు - శ్రీమతి కల్పనల కుమారుడు)ల వివాహం మార్చి 22వ తేదీ నెల్లూరులో వైభవోపేతంగా జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభాశీస్సులు.

# శ్రీసిటీలో అలరించిన 'శ్రీనివాస కళ్యాణం'.. హరికథాగానం



తిరుపతి తిరుమల దేవస్థానం (టీటీడీ) సౌజన్యంతో శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో ఇటీవల శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన 'శ్రీనివాస కళ్యాణం' హరికథాగానం భక్తులను ఎంతగానో అలరించింది. శ్రీనివాస కళ్యాణంలోని వివిధ ఘట్టాలను పాటలతో, అద్భుత హావభావాలతో వివరిస్తూ సాగిన హరికథాగానం భక్తులను తన్మయుల్ని చేసింది. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ హరికథా కళాకారిణి మంజుల, వాద్య బృందం పురుషోత్తం (కీ బోర్డు), బుజ్జి (తబలా), శ్రీనివాసులు (శృతి) ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ మరియు పరిశ్రమల ఉద్యోగులు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. హరికథ అనంతరం నిర్వాహకులు భక్తులందరికీ స్వామివారి అన్నప్రసాదాలను అందజేశారు.

# సత్యవేడు గురుకుల పాఠశాలకు వంటసామగ్రి వితరణ




శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ పరిశ్రమ, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సత్యవేడులోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలుర రెసిడెన్షియల్ స్కూల్ (ప్రభుత్వ గురుకుల పాఠశాల)కు లక్ష రూపాయల విలువ చేసే వంట సామాగ్రిని వితరణగా అందజేసింది. ఈ సందర్భంగా ఇటీవల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ సామాగ్రిని స్కూల్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులకు అందచేశారు. అందుకు శ్రీసిటీ యాజమాన్యానికి పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పరిశ్రమ అధికారులు మల్లీశ్వరన్, మహేష్, సాయి కృష్ణశ్రీ, లక్ష్మి, శ్రీసిటీ ప్రతినిధులు వై.రమేష్, సురేంద్రకుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి

ఎన్నికల నియమావళిని అనుసరించి రాజకీయపార్టీలు, అభ్యర్థులు ప్రచారం చేసుకోవడానికి తగిన అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఈనెల 26న ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సమావేశాల నిర్వహణ, మైక్‌సెట్, ఆయా పార్టీల తాత్కాలిక కార్యాలయాల ఏర్పాటు, వాహనాల వినియోగం, ప్రదర్శనలు, లౌడ్‌స్పీకర్లు, వీధి సమావేశాలు, గాలి బెలూన్ల ఏర్పాటు, ప్రచార వాహనాలు, బారికేడ్ల ఏర్పాటు, ఇంటింటి ప్రచారం లేదా గడప గడపకు ప్రచారం చేయడానికి ఆయా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు.



# జానకిరామ.. రామాయణం 6

- ఊటుకూరు జానకి రామారావు

విశ్వామిత్ర మహర్షి మాటలు విన్నాడు దశరథుడు.

మనసొప్పటంలేదు ఆయనకు! ఇలా అంటున్నాడు!

**ఊన షోడశ వర్షేణ రామో రాజీవ లోచనః**

**న యుద్ధయోగ్యతామస్య పశ్యామి సహ రాక్షసైః**

రాజీవలోచనుడైన నా రామునకు పదహారు సంవత్సరాలు ఇంకారాలేదు (పదహారుకు ఒకటి తక్కువ, ఊన అంటే −1)

రాక్షసులతో యుద్ధం చేసే యోగ్యత ఉన్నదని నేను అనుకోవడంలేదు!

నా రాముడు ఇంకా బాలుడయ్యా! పూర్తిగా ఇంకా విద్యలే నేర్వలేదు! అస్త్రాలు ఇంకా తెలియవు! అలాంటివాడు మాయావులైన రాక్షసులతో ఎలా యుద్ధం చేయగలడు! కోరి కోరి కొడుకును కొలిమిలో ఎవరైనా నెట్టివేస్తారా!.

మహర్షీ నేనే ధనుస్సు ధరించి మీవెంట నడుస్తాను, నా వెంట మెరికల్లాంటి యోధులు ఒక అక్షౌహిణి సైన్యం నడుస్తుంది!

మీ యాగసంరక్షణ నేనుగావిస్తాను మునీంద్రా!

నా రాముడు బాలుడు! ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డడు. వాడిని విడిచి ఒక్క క్షణమైనా నేను బ్రతుకజాలను!.

అంతగా నీకు రాముడే కావలెనంటే అతనితోపాటు నన్ను నా చతురంగబలాలనూ కూడా తీసుకొని వెళ్ళు, అంతేకానీ ఒంటరిగా రాముని నే పంపజాలను!.

మునిచంద్రా అసలు ఆ రాక్షసులు ఎవరు? ఎవరు పంపగా వారు నీ యాగానికి విఘ్నం గావిస్తున్నారు?.

రాజా ఆ రాక్షసులు రావణాసురుడు పంపగా వచ్చినవారు, రావణుడు బ్రహ్మవరప్రసాది! విశ్రవసు పుత్రుడు!

ఆయనచే ప్రేరేపింపబడి మారీచ సుబాహులనెడి వారు యజ్ఞ విఘ్నానికి పూనుకొన్నారు!

అసలు విషయం వినగానే దశరథమహారాజు తీవ్రమైన వేదనకు గురై...,

మహర్షీ!

దేవ, దానవ, యక్ష, గంధర్వ, పతగ, పన్నగులలో రావణుని ఎదిరించువారు లేరే!

నా పసికూన! రాముని, వానికి ఎదురు వెళ్ళమంటావా! నన్ను కనికరించు మహర్షీ! నా కొడుకు పట్ల అనుగ్రహము చూపు!

మహర్షీ! అంతటి బలవంతుడికి నేనుగానీ, నాసైన్యముగానీ, నా కుమారుడుగానీ ఎదురు నిలవలేము! యుద్ధము చేయజాలము!

ఆ మారీచ, సుబాహులు మాయావులు, మహాబలవంతులు. వారిలో నా స్నేహితులతో కలసికూడా ఎవరో ఒకరితోనే తలపడగలను, అలాంటిది ఇద్దరితో తలపడమని రాముని పంపటమా నా వల్ల కాదు! పంపనుగాక పంపను! అని ఖండితముగా పలికాడు దశరథుడు!

దశరథుడి ఈ అసంబద్ధ ప్రేలాపనలు విని మహర్షి ఒక్కసారిగా తోకతొక్కిన త్రాచు అయినాడు! యజ్ఞ కుండంలో నేయివోయ భగ్గున లేచిన పెనుమంట అయినాడు, తీవ్రమైన కోపంతో కనులు అరుణ వర్ణం దాల్చాయి!.

అడిగినది ఇస్తానని ప్రతిజ్ఞ చేసి మాట తప్పుతున్నావ్ దశరథా! ఇది రఘువంశ సంజాతులు చేయవలసిన పనికాదు! సరే నీ కొడుకుతో, బంధుమిత్రులతో సుఖంగా ఉండు. వచ్చిన దారినే నే వెడతాను అని తీవ్రమైన ఆగ్రహావేశాలతో కంపించిపోయాడు!.

విశ్వామిత్రుని గురించి సకలము తెలిసిన మహర్షి వశిష్టుడు కల్పించుకొని! రాజా! నీవు ఇక్ష్వాకుడవు! నీ వంశమెట్టిది? లోకంలో మీరే ఆడిన మాట తప్పితే ఇంక మాటమీద నిలబడే వారెవరయ్యా! నీ మనసులో ఏ విధమైన శంకకు తావివ్వకు, రాముని విశ్వామిత్రునితో యాగసంరక్షణార్ధమై పంపు!.

ఈ విశ్వామిత్రుడెవరనుకొన్నావు? ఈయన సంరక్షణలోనున్న రామునికి అస్త్రములు తెలిస్తే నేమి? తెలియకున్న నేమి?

విశ్వామిత్రుడు మూర్తీభవించిన ధర్మము! పరాక్రమవంతులలో శ్రేష్టమైన వాడు!

ఈయనకు తెలిసినన్ని అస్త్రములు సకలభువనాలలో ఎవరికీ తెలియవు! మరి భవిష్యత్తులో కూడా ఈయనకంటే ఎక్కువగా ఎవరికీ తెలియవు!.

ఈయనకు తెలిసిన శస్త్రాస్త్రాలెలాంటివో చెపుతాను విను!

ఈ లోకములో ఏ ఏ అస్త్రములు అయితే వున్నవో అవి అన్నియు విశ్వామిత్రుని వద్ద ఉన్నవి.

అస్త్రములు అన్నీ కూడా భృశాస్వుని పుత్రులు.

భృశాస్వుడు ఒక ప్రజాపతి, ఆయన దక్షప్రజాపతి కూతుళ్ళు జయ, సుప్రభలను వివాహమాడి కన్న సంతానమే అస్త్రములు!

వీటిని విశ్వామిత్రుడు పొందుతాడు!

అంతేకాదు విశ్వామిత్ర మహర్షికి గల అస్త్ర పరిజ్ఞానము అపారము (guided missiles).

ఈయన క్రొత్త అస్త్రములు ఎన్నింటినో పుట్టించగలడు కూడా!

(శస్త్రము అంటే మామూలుగా గాయం చేసేది! అస్త్రము అంటే మంత్రపూర్వకముగా ప్రయోగించేది! bulletకు intercontinental ballistic missileకు ఉన్నంత తేడా అన్నమాట).

ఓ దశరథమహారాజా, విశ్వామిత్ర మహర్షి అమిత మేధో సంపన్నుడు! అతులిత పరాక్రమవంతుడు! ఆయన తన యాగసంరక్షణము తానే చేసుకోగల సర్వసమర్థుడు!

ఆయన అడుగుతున్నాడు నీ రాముడిని పంపమని!

ఆయన వెంట వెళితే రామునకు మేలుకలుగుతుంది! మహర్షి ఉద్దేశ్యము అదే! రాముడెవరో సంపూర్ణముగా తెలిసిన మహాజ్ఞాని ఆయన!

నీవు మనసులోని భయసందేహాలన్నింటినీ తొలగించుకొని రామచంద్రుని ఆయనవెంట పంపు, సకల శుభాలు ఒనగూరుతవి!.



కులగురువు మాటలు విని దశరథుడి శరీరం ఉప్పొంగింది!

రాముని మహర్షి వెంట పంపటానికి సంతోషంగా ఒప్పుకొన్నాడు!.

స్వయముగా వెళ్ళి రామలక్ష్మణులను తీసుకొని వచ్చి ఒక్కసారి తన ప్రియపుత్రుని శిరస్సు ముద్దిడుకొని, మహర్షి చేతిలో పెట్టాడు!

మూపున విల్లమ్ములు ధరించి రాముడు, లక్ష్మణుడు మహర్షిని అనుసరించారు. బ్రహ్మదేవుడు ముందువెడుతుండగా వెనుక ఇద్దరు అశ్వనీదేవతలనుసరించినట్లుగా కనపడుతున్నారు వారివురూ చూపరులకు!. బాటలు నడిచారు, పేటలు గడిచారు. నడుస్తూనే ఉన్నారు మహర్షి వెనుదిరిగి చూడలేదు.

ఆ విధంగా మొదటిసారి నగరువిడచి దుర్గమారణ్యాలలో కాలు మోపాడు కోదండపాణి సోదరసమేతుడై!.

అలా చాలా దూరం నడచిన తరువాత తనలోని ప్రేమంతా మాటరూపంలో బయలుపడేటట్లుగా "రామా" అని అత్యంత మధురంగా పిలిచాడు మహర్షి!

అప్పటిదాకా ఆయన వెనుదిరిగిచూడలేదు, చూస్తే రాముని మధుర మోహనరూపం కట్టిపడేస్తుంది, ముందుకు సాగనీయదు అనే భయం వల్లనేమో బహుశా!

సరయూనదీ దక్షిణతీరం చేరారు! ఆ నది ఒడ్డున కాసేపు ఆగి నాయనలారా ఆచమనం చేయండి! మీకు కొన్ని మంత్రములను, 'బల', 'అతిబల' అను విద్యలను ఉపదేశిస్తాను! స్వీకరించండి!

ఈ విద్యలెటువంటివి అంటే! ఇవి తెలుసుకొన్న తరువాత నీకు శ్రమగానీ, జ్వరముగానీ, రూపములో మార్పుగానీ సంభవించదు!

నీవు నిద్రపోయినప్పుడుగానీ, ఏమరపాటుగా ఉన్నప్పటికీ కూడా రాక్షసులు నిన్నేమీ చేయజాలరు!

రామా! బాహుబలములో నీతో సమానుడు, మూడులోకములలో ఎవడునూ లేడు. ఇకముందు ఉండడు!

రామా! సౌందర్యము, సామర్థ్యము, జ్ఞానము, బుద్ధినైశిత్యములలో నీతో సరిసమానుడు ఈ లోకములో ఉండడు!

ఈ విద్యలు బ్రహ్మదేవుని పుత్రికలు!

అంత శ్రీరాముడు శుచియై, శుద్ధాంతరంగుడై, ఆ మహర్షి నుండి విద్యలను ఆనందంగా స్వీకరించాడు!

..(సశేషం)

# వేద విజ్ఞాన వేదిక సభ.. 31న

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ధారావాహికంగా జరుగుతున్న ఉపన్యాసాల కార్యక్రమాల్లో భాగంగా మార్చి 31వ తేది సాయంత్రం 6.30 గంటలకు గుంటూరు లోని విశ్వనాథ సాహిత్య అకాడమీ కార్యదర్శి మోదుగుల రవికృష్ణ 'హరికథా పితామహులు ఆదిభట్ల నారాయణదాసు వ్యక్తిత్వం–సాహిత్యం' అనే అంశంపై ఉపన్యసిస్తారని ఆ వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై–టీనగర్, 22–విజయరాఘవరోడ్డులోని కృష్ణాహాల్–ఆంధ్రాక్లబ్‌లో ఈ ఉపన్యాసం ఉంటుందని, సాహిత్యాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

# సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ దాతృత్వం

ఆత్మకూరులోని సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 23న ఆత్మకూరులో ఇటీవల మరణించిన పులి దుర్గాప్రసాద్, గంగవరపు కొండమ్మల కుటుంబసభ్యులకు 10వేల రూపాయల వంతున ఆర్థికసాయాన్ని అందజేశారు. ట్రస్టు సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, ఏ.నరసింహారెడ్డి, కెవి శేషారెడ్డి ఆ కుటుంబాలవారిని పరామర్శించి ట్రస్ట్ తరపున ఆ సాయం వారికి అందజేశారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని గిట్టుబాటు ధర పొందాలని డివిజినల్ కోఆపరేటివ్ అధికారిణి బి.సుధాభారతి చెప్పారు. ఈనెల 23న ఆమె జిల్లాలోని తోటపల్లిగూడూరు, పేదూరు ప్రాథమిక సహకార సంఘాలను సందర్శించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. అనంతరం, రబీ సీజన్ కింద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పేదూరు పీఏసిఎస్ సిఇఓ పివి రమణమూర్తి, సమన్వ అధికారులు శ్రీనివాసులు, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# 'పెరసం' ఆధ్వర్యంలో.. 7న ఉగాది పురస్కారాలు

పెన్నా రచయితల సంఘం(పెరసం) ఆధ్వర్యంలో ఏప్రిల్ 7న ప్రముఖ కవయిత్రి తోట సులోచన సౌజన్యంతో, ఆమె తల్లితండ్రులు దివంగత తోట చెంచులక్ష్మమ్మ–తోట గురుమూర్తి స్మారక ఉగాది పురస్కారాలను అందజేయనున్నట్లు పెరసం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు హోస్పిటల్ సమావేశ మందిరంలో ఆరోజు ఉదయం 9.30గంటలకు ప్రముఖ పద్యకవి పోలవరపు లక్ష్మీనరసింహారావు, నెరసం (నెల్లూరుజిల్లా రచయితల సంఘం) అధ్యక్షులు అనుమల జయప్రకాష్, ప్రముఖ కవి పేరిసెట్ల శివకుమార్, ప్రముఖ కవయిత్రులు గూడూరు ఉషారాణి, దేవరాయపల్లి ప్రసూనాశరత్‌లకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. ఈ సందర్భంగా, క్రోధి నామ సంవత్సర ఉగాది కవిసమ్మేళనం ఉంటుందని, కవిత్వాభిమానులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఇనమడుగులో ఆటోబోల్తా–వృద్ధురాలు కన్నుమూత

ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రిలో చికిత్సపొంది, స్వస్థత చేకూరాక తిరిగి ఇంటికి ఆటోలో వస్తుండగా దారిలో ఆటో బోల్తాపడడంతో విడవలూరుకు చెందిన బండ్ల లక్ష్మమ్మ (72) అనే ఓ వృద్ధురాలు తీవ్రగాయాలపాలై కన్నుమూసింది. ఆటోలో ఉన్న మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి.

## జయభారత్ ఆసుపత్రిలో
# 'ఆయుష్మాన్‌భవ'

నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలో ఈనెల 23న తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార మండలి జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'ఆయుష్మాన్‌భవ' కార్యక్రమం నిర్వహించి, ఆసుపత్రిలో ఉన్న రోగులకు తిరుమలేశుని లడ్డూ ప్రసాదాన్ని, పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. తొలుత శ్రీవారి చిత్రపటం వద్ద పూజలు చేశారు. భక్తులకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షిస్తూ, ధార్మిక మండలి జిల్లా అధికారి ఆర్.స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సీవి సుబ్రహ్మణ్యం, జి.రవికుమార్, ఎన్.జయరామయ్య, డాక్టర్ రమణయ్య, పి.వెంకటేశ్వర్లు, ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్‌తో పాటు గుర్రం సుధాకర్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## తలసీమియా సెంటర్‌కు..
# రూ. 25 లక్షల విరాళం




నెల్లూరు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో తలసీమియా డే కేర్ సెంటర్‌కు దాతలు దిలీప్ జైన్ (డైరెక్టర్–డీపీ గోల్డ్ ప్రై.లిమిటెడ్), ఆయన తనయుడు రాహుల్ జైన్‌లు పాతిక లక్షల రూపాయల విరాళాన్ని అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఈనెల 24న రెడ్‌క్రాస్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కమిటీ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి వారు ఆ విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి మాట్లాడుతూ, త్వరలో తలసీమియా సెంటర్‌ను 20 పడకల క్లినిక్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి ఏటా తలసీమియా బాధితులకు 1500 యూనిట్ల రక్తాన్ని ఉచితంగా అందిస్తున్నామని, ఈ క్లినిక్‌లో చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు చేయిస్తున్నామని చెప్పారు. తలసీమియా ప్రాజెక్టు కన్వీనర్ డాక్టర్ సీత, రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







# దబ్బులిచ్చాం.. ఓట్లేయండి!

(మొదటి పేజీ తరువాయి)

మొన్నటివరకు జరిగిన సిద్ధం సభలలోనూ, ప్రస్తుతం బస్సు యాత్రలో భాగంగా జరుగుతున్న 'మేమంతా సిద్ధం' సభలలోనూ ముఖ్యమంత్రే స్వయంగా తాను 130 సార్లు బటన్ నొక్కి 2 లక్షలా 70 వేల కోట్లు ప్రజలకి పంచిపెట్టానని చెప్పుకుంటున్నారని విశ్లేషకులు చెప్తున్నారు. ప్రతిపక్ష పార్టీలని విమర్శించడం, పచ్చ పత్రికలంటూ ఆడిపోసుకోవడం, అందరూ ఒక్కటై తనమీదకి దండెత్తి వస్తున్నారని చెప్పి ప్రజలకి తనపై జాలి కలిగించేలా ముఖ్యమంత్రి ప్రసంగాలు ఉంటున్నాయి తప్ప ఎక్కడా రాష్ట్ర అభివృద్ధి ప్రస్తావనే లేదన్నది వారి భావన.

## నాయకుడి బాటలో నేతలు!

వైసీపీ తరఫున ఎన్నికల బరిలో దిగి పోటీ చేస్తున్న నేతలు కూడా పంపకాల దండకాన్నే వల్లించడం విడ్డూరంగా ఉందని రాజకీయ వర్గాలు విమర్శిస్తున్నాయి. అయిదు సంవత్సరాలు మంత్రులుగా, ఎం.పీలుగా, ఎం.ఎల్.ఏలుగా వాళ్ళేమి వెలగబెట్టారో చెప్పకుండా, వాళ్ళు కూడా మా నాయకుడు మీకు డబ్బులిచ్చాడు... మీరు మాకు ఓట్లు వేయండి అని అడగడం వింతగా ఉందని మండల స్థాయి నాయకులు చెప్తున్నారు. ఈ ఐదేళ్లలో మీ నియోజకవర్గంలో మీరేం చేశారు? అని ప్రశ్నిస్తే అందరూ తెల్లమొహం వేస్తున్నారని అంటున్నారు. "జగన్ సారు డబ్బులిచ్చాడు కదా ఇంకేం కావాలి" అని మొహం చాటేస్తున్నారని గ్రామస్థాయిలో విస్తృతచర్చ జరుగుతోందని వైసీపీ నాయకులే వాపోతున్నారని చెప్తున్నారు.

## ఈ ఐదేళ్లు ప్రభుత్వ డబ్బులతో ఓట్లు కొన్నారా?

వివిధ సంక్షేమ పథకాలు, వాటికి ప్రచారం పేరుతో ప్రభుత్వ ఖజానా మొత్తం ఖాళీ చేశారా...? అని విశ్లేషకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు టాక్సుల రూపంలో చెల్లించిన లక్షల కోట్ల రూపాయల వారి కష్టార్జితాన్ని ప్రభుత్వ పెద్దలు ఓట్ల కొనుగోలు కోసం ఓటర్ల ఖాతాలో జమ చేశారా..? అని మధ్య తరగతి ప్రజలు వైసీపీ నేతలని నిలదీస్తున్నారని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి.

ఎన్నికలకి ఇంకా 45 రోజుల గడువు ఉంది. ఇప్పటికైనా అధికార పార్టీ తమ పంథా మార్చి పంపకాల బాగోతాన్ని, తిట్ల దండకాన్ని ఆపి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టిపెట్టి మాట్లాడితే కొంతలో కొంతైనా ప్రజలు శాంతిస్తారన్న మాట సర్వత్రా వినిపిస్తోంది!

# ఒంగోలు పార్లమెంటుకు మా నాన్నే పోటీ చేస్తారు!

## మాగుంట శీనయ్య కుమారుడు రాఘవరెడ్డి

ఒంగోలు టీడీపీ పార్లమెంటు అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డి పేరునే చంద్రబాబు ఖరారు చేయబోతున్నట్లు సమాచారం. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో సీనియర్ వ్యక్తులు పార్లమెంటులో ఉంటే రాష్ట్ర ప్రయోజనాలకు సౌలభ్యంగా ఉంటుందన్న చంద్రబాబునాయుడి ఆలోచన మేరకు తనకి బదులుగా తన నాన్న ప్రస్తుత పార్లమెంటుసభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి ఎన్నికల బరిలో ఉంటారని శీనయ్య కుమారుడు రాఘవరెడ్డి ఓ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

తెలుగుదేశం, బీజేపీ మరియు జనసేన పార్టీల శ్రేణులు, ప్రజలు, మాగుంట, అభిమానులు తమ నాన్న విజయానికి కృషి చేయవలసిందిగా రాఘవ ఆ ప్రకటనలో కోరారు. గతంలో లాగే తాను కూడా ప్రకాశం జిల్లా యువతకి, నాయకులకి, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఒంగోలు పార్లమెంటు అభివృద్ధికి కృషి చేస్తానని సదరు ప్రకటనలో పేర్కొన్నారు. మాగుంట కుటుంబం ఎల్లవేళలా ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గంతో పాటు, ప్రకాశం జిల్లా ప్రజలకి అందుబాటులో ఉంటుందని ప్రకటించారు.

# జనసేనానిని కలసిన శీనయ్య, రాఘవ!

- **దర్శి శాసనసభ జనసేన అభ్యర్థిగా మాగుంట రాఘవరెడ్డి?**



మార్చి 27వ తేదీ బుధవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన కుమారుడు రాఘవరెడ్డి జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ని కలిశారు. జనసేన తరఫున రాఘవరెడ్డి దర్శి శాసనసభ అభ్యర్థిగా బరిలో వుండే అవకాశం ఉందని జనసేన వర్గాలు ప్రచారం చేసుకుంటున్నాయి. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ఇద్దరు కలిసి ప్రతిపాదించి బలవంతపెడితే రాఘవ ఉమ్మడి అభ్యర్థిగా దర్శి శాసనసభకు పోటీచేసే అవకాశాలు లేకపోలేదని మాగుంట వర్గాల సమాచారం. మొత్తంమీద ఆంధ్రాలో 2024 సార్వత్రిక ఎన్నికలు చిత్రవిచిత్ర మలుపులు తిరుగుతున్నాయనడంలో సందేహం లేదు..!!


కన్నీటి నివాళి..!



రత్నం మాస్టారూ...
రాజా.... అని ఆప్యాయంగా పలకరించే మీ పిలుపు
ఇక వినిపించదంటే ఎలా తట్టుకోను...
అమూల్యమైన వాత్సల్యాన్ని కురిపించే మీ రూపం
ఇక కనిపించదంటే ఎలా నమ్మను...
అవ్యాజమైన మీ ప్రేమానురాగాలు
ఇక నా మనసుని పులకరింపచేయవంటే ఎలా జీర్ణించుకోను...
నాపై ఇంతటి మమకారాన్ని చూపించిన
మీ కోసం.. నేనేమివ్వగలను
"నా కన్నీరు తప్ప".
మా మాస్టారు ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

డా॥ సి.ఎస్.శ్రీనివాస రాజు, MD, DM
Chief interventional cardiologist
KIMS Hospital, Nellore



శ్రద్ధాంజలి



సేవా పరాయణులు
ప్రముఖ విద్యావేత్త
మా కుటుంబానికి అత్యంత ఆప్తులు
కే.వీ.రత్నం గారి
పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ..
మా శ్రద్ధాంజలి.

గ్రోసు సుబ్బారావు
మురళీకృష్ణ 70 గ్రూప్



### ఎన్‌బికెఆర్‌లో...

## సృజన-2కె24 జాతీయ సదస్సు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల 2కె24-జాతీయ సదస్సు జరిగింది. కళాశాలలోని సైన్స్-హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో విద్యార్థులు గణితం, రసాయన-భౌతికశాస్త్రాల వంటి పలు విభాగాల్లో పరిశోధనాపత్రాలు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపట్ల నిర్లక్ష్యం వహించకుండా, అందివచ్చిన అన్ని అవకాశాలను వినియోగించుకుని విద్యలో ఉన్నతంగా రాణించాలన్నారు. ఇలాంటి సదస్సుల ఏర్పాటుకు.. తద్వారా విద్యార్థుల భవితకు బాటలు వేస్తున్న కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సదస్సుకు డా.ఎం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించగా, అధ్యాపకులు డా. ఎస్ నందకిషోర్, డా. ఓ.కామేశ్వర రావు డా.బి రాధాకృష్ణ, డా.జి మాధవయ్య పర్యవేక్షించారు. డా.ఎస్ పీటర్ వందన సమర్పణ చేశారు.

## భగత్‌సింగ్‌కు నివాళి

దేశస్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా ఈనెల 23న కావలిలోని నలంద స్కూల్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ షఫి, జోత్స్న, ఎస్‌ఎఫ్‌ఐ సభ్యులు లోకేష్, వర్షిత్, భాను, అభి పాల్గొన్నారు.

### ప్రజల ఆదరణతో

## వైకాపా విజయం తథ్యం

**- ఆదాల ప్రభాకర్‌రెడ్డి**



రాష్ట్రంలో ప్రజలు జగన్‌మోహన్ రెడ్డిని అభిమానిస్తున్నారని, వైకాపా పట్ల ఆదరం చూపిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో వైకాపా విజయం తథ్యమని నెల్లూరు రూరల్ శాసనసభ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 23న ఆయన రూరల్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన ఉందన్నారు. ప్రజలంతా వైకాపాకు భారీ మెజార్టీ సాధించిపెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పెద్దసంఖ్యలో స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వాకర్స్.. ఉచిత వైద్య శిబిరం



నెల్లూరు ఏసి స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో ఈనెల 24న డాక్టర్ మారం సుధాకర్ సారథ్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షుగర్, బీపీ తదితరాలను పరీక్షించి తగు సూచనలిచ్చారు. మంచినీటి విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకుంటే పలురకాల ఆరోగ్యసమస్యలను నివారించుకోవచ్చన్నారు. ఫ్రెండ్స్ వాకర్స్ అధ్యక్షులు బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కార్యదర్శి షేక్ నజీర్ అహ్మద్, కోశాధికారి శానంపూడి సుబ్బరాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, వాకర్స్ ప్రతినిధులు కొండూరు సుబ్బారావు, సోను, ఉద్దండి అమరలింగం, మన్నేపల్లి సురేష్, జివి కృష్ణయ్య, పత్తిపాటి రమణయ్య, డి.జయరామానాయుడు, దాసరాజు సత్యనారాయణ, పాముల శ్రీనివాసులు, ఏ.వి సుబ్బరాజు, లక్కాకుల శ్రీనివాసులు, కిలారి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### టూకీగా...

## పెంచలకోనలో నేత్రపర్వంగా.. శ్రీ లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవం

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలం పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఈనెల 23న స్వామివారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. అనంతరం సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ఈ వేడుకలను తిలకించి తరించారు.

## సీతారామపురంలో టీబీపై అవగాహన ర్యాలీ

మండల కేంద్రమైన సీతారామపురంలో ఈనెల 23న టీబీ వ్యాధిపట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీబీ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధి గ్రస్తులకు పీహెచ్‌సిలో ఉచితంగా మందులిస్తామన్నారు. ఎంపీహెచ్ఇఓ మజీద్, కృష్ణమ్మ, రియాజ్, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెంచుగానిపాలెంలో రక్తదాన శిబిరం

కావలి రూరల్ మండలం చెంచుగానిపాళెం గ్రామంలో ఈనెల 23న శ్రీచైతన్య డిగ్రీకాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులపాటు ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్తులకు ఉచిత వైద్యపరీక్షలు చేశారు. 6వ రోజున 23 మంది యువకులు రక్తదానం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి వెంకటసాయితేజ, వలంటీర్లు పాల్గొన్నారు.

## మాలకొండ హుండీ ఆదాయం రూ.6.8 లక్షలు

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాళెం మండలంలోని ప్రసిద్ధపుణ్యక్షేత్రం మాలకొండ శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి ఈనెల 23న శనివారం ఒక్కరోజునే భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు, వివిధ పూజలు సేవల ద్వారా రూ.6,83,444 వచ్చింది. ఆలయ అధికారి కెబి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరిగింది.



# శ్రద్ధాంజలి



జననం
23.05.1943

నిర్యాణం
20.03.2024

మాననీయ విలువలున్న మానవీయమూర్తి
సేవా రంగంలో నిరుపమానంగా వెలిగిన సేవాదీప్తి
విద్యారంగంలో వెలుగులు విరజిమ్మిన విజ్ఞానమూర్తి
మా కుటుంబ కీర్తి, మా అభివృద్ధికి స్ఫూర్తి

## కే.వీ.రత్నం గారు

వ్యవస్థాపకులు, రత్నం విద్యాసంస్థలు
మార్చి 20, 2024 బుధవారం మధ్యాహ్నం పరమపదించారు.
**ఆ మహనీయుని మహితాత్మకు శాంతి చేకూరాలని**
**భగవంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం.**



**కొర్రపాటి పద్మావతి రత్నం** - భార్య

కుమారులు - కోడళ్ళు
**కే.వేణుగోపాల్ - కే.రమాదేవి**
**డా॥ కే. కృష్ణకిషోర్ - కే.వాసంతి**

మనుమళ్ళు - మనుమరాళ్ళు
**కే.రోహిత్ - కే.లక్ష్మీ రోహిత**
**కే.రోషిణి - అంబికా ఈశ్వర్**
**కే.శివాని**

### ఉత్తరక్రియలు

వారి పెద్దకర్మ తేది. 03.04.2024
బుధవారం ఉదయం 10.30 గంటలకు
ధనలక్ష్మీపురంలోని రత్నం CBSE స్కూలు నందు జరుగును.
కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

కార్యక్రమం జరిగే చిరునామా కొరకు
క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com